
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

శనివారం 26 జూలై 2025





● శ్రావణ శోభ

శ్రావణమాస ఆరంభం, తొలి శ్రావణ శుక్రవారం కావడంతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# జోరువాన

## జిల్లావ్యాప్తంగా భారీ వర్షం

మచిలీపట్నం/నాగాయలంక, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శనివారం కోస్తాతీరం వెంబడి వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు చల్లపల్లిలో అత్యధికంగా 22.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా పెదపారుపూడిలో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా, జిల్లా సగటు 7.7 మిల్లీమీటర్లుగా నమోదైంది. ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న వరద నీరు శుక్రవారం నాగాయలంక రేవుకు చేరింది. శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్‌లో ఉన్న కృష్ణవేణమ్మ విగ్రహం మెట్లను వరద నీరు తాకింది. మత్స్యకారులు పడవలను ఒడ్డుకు చేర్చి లంగర్లు వేశారు. వరదను చూసేందుకు సందర్శకులు భారీగా తరలివచ్చారు.



నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం ఘాట్ వద్దకు చేరిన వరద నీరు

# మూడేళ్లలో మెట్రో

## విజయవాడ, విశాఖ మెట్రో ప్రాజెక్టులు పూర్తికి ఒప్పందం

- విజయవాడకు 'టిప్సా', విశాఖకు 'శిస్త్రా' జనరల్ కన్సల్టెన్సీల నియామకం
- మంత్రి నారాయణ సమక్షంలో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎంఓయూ

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు జనరల్ కన్సల్టెంట్లతో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఒప్పందాలను కుదుర్చుకుంది. విజయవాడలోని ఏపీసీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సమక్షంలో ఆయా కన్సల్టెన్సీ సంస్థలతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఒప్పందాలు చేసుకుంది. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు స్పెయిన్‌కు చెందిన 'టిప్సా' సంస్థతోనూ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టుకు ఫ్రాన్స్‌కు చెందిన శిస్త్రా సంస్థను జనరల్ కన్సల్‌టెంట్లుగా నియమించుకుంది. నాలుగేళ్ల పాటు విశాఖ, విజయవాడ మిగతా 6లో..

# ఏసీబీ వలలో మరో అధికారి

- రూ.40 వేలు లంచం తీసుకుంటూ దొరికిన ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్

6

# వేగం పెంచాలి

6

## అలా అయితేనే ఈ-క్రాప్ నమోదు పూర్తి

జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరముంది. వారం కిందట ఈ-నమోదు ప్రారంభమైంది. సెప్టెంబరు 15వ తేదీలోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో కొన్ని మార్పులు, సాంకేతిక సమస్యలు ఉన్న నేపథ్యంలో వేగంగా ఈ ప్రక్రియను చేపట్టాల్సిన అవసరముంది.

### వారం కిందట ప్రారంభమైన ప్రక్రియ

- సెప్టెంబరు 15వ తేదీ తుది గడువు
- ఇటీవలే వీఏఏల బదిలీ.. కొత్తవారి రాక
- కొత్త మండలాల్లో అవగాహన లేక అవస్థలు
- ఈసారి కౌలురైతుల పేరుమీదే నమోదు
- కౌలు గుర్తింపుకార్డులు ఇచ్చింది 57 వేల మందికే..
- లంక భూముల్లోని పంటలపైనా రైతుల్లో సందిగ్ధం



వరినాట్లు పూర్తిచేసిన పొలం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు వరి, ఇతర పంటలు 1.80 లక్షల ఎకరాల్లో, ఉద్యాన పంటలు 25 వేల ఎకరాల్లో చేపట్టారు. పది రోజులుగా వాతావరణం వ్యవసాయానికి అనుకూలంగా మారడంతో జిల్లాలో వరినాట్లు వేగవంతమయ్యాయి. ఆగస్టు మూడోవారం నాటికి పూర్తవుతాయని అంచనా. గ్రామాల్లో పనిచేస్తున్న వ్యవసాయశాఖ అసిస్టెంట్ల (వీఏఏ)ను ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్నారనే కారణంతో ఇటీవలే బదిలీ చేశారు. ఇతర మండలాల్లోని ఆర్‌ఎస్‌కేలకు వారిని పంపించారు. ఆర్‌ఎస్‌కేలకు నూతనంగా వచ్చిన వీఏఏలకు ఆయా గ్రామాలపై అవగాహన రావడానికి కొంత సమయం పడుతుంది. దీంతో ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ ప్రక్రియను ఎప్పటికి పూర్తిచేస్తారనే అంశంపై సందిగ్ధం ఏర్పడింది. ఈ ఏడాది ఈ-క్రాప్ నమోదుచేసే సమయంలోనే రైతులతో ఈకేవైసీ కూడా చేయించాలనే నిబంధన పెట్టడం వల్ల ఈ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరముంది.

### షెడ్యూలు ఇలా..

వారం క్రితం ఈ-క్రాప్ నమోదు ప్రారంభమైంది. ఇప్పటివరకు కేవలం 900 ఎకరాల్లోనే నమోదు చేశారు. సెప్టెంబరు 15 నాటికి ఈ ప్రక్రియను పూర్తిచేయాలి. అదేనెల 19 నుంచి 24 వరకు జాబితాలను రైతుసేవా కేంద్రాలు, సచివాలయాల వద్ద నోటీసు బోర్డుల్లో ఉంచాలి. గ్రామసభలు నిర్వహించి జాబితాలను రైతుల సమక్షంలో తనిఖీ చేయాలి. అభ్యంతరాలు ఉంటే.. 25 నుంచి 28వ తేదీ వరకు స్వీకరించి, పరిష్కరించాలి. 30వ తేదీన తుది జాబితా ప్రకటించాలి.

### ఈసారి జియో రీఫెన్సింగ్ విధానం

ఈసారి ఈ-క్రాప్ నమోదులో నూతన విధానాన్ని అమలు చేస్తున్నారు. జియో రీఫెన్సింగ్ విధానంలో రైతుసేవా కేంద్రాల్లో పనిచేసే వ్యవసాయశాఖ అసిస్టెంట్లు (వీఏఏ), వీఆర్వోలు పొలం వద్దకు వెళ్లి సంబంధిత భూమి సర్వే నెంబర్ల ఆధారంగా పంట వివరాలను ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక ఫార్మాట్‌లో నమోదు చేయాలి. ఈ-క్రాప్ మిగతా 6లో..

### అసైన్డ్, లంక భూముల పంట వివరాలు నమోదు చేసేనా?

తీరప్రాంతంలోని బందరు, పెడన, కృత్తివెన్ను, కోడూరు, నాగాయలంక తదితర మండలాల్లో అసైన్డ్ భూముల్లోనూ రైతులు వరిసాగు చేస్తున్నారు. అసైన్డ్ భూముల్లో సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదుచేస్తారా లేదా అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వట్లేదు. చల్లపల్లి, తోట్లవల్లూరు, ఘంటసాల, అవనిగడ్డ, పెనమలూరు, మోపిదేవి మండలాల్లోని లంకభూముల్లో చెరుకు, కంద, పసుపు, పూలు, కూరగాయల తోటలను రైతులు సాగు చేస్తారు. ఈ పంట వివరాలను ఏ ప్రాతిపదికన ఈ-క్రాప్‌లో నమోదు చేస్తారనే అంశంపై సందిగ్ధం ఏర్పడింది. అధికశాతం లంక భూములకు సర్వే నెంబర్లు ఉండవు. రెవెన్యూ రికార్డుల్లో చల్లపల్లి రాజా భూములు, లేదా లంకల్యాండ్స్ అని మాత్రమే నమోదై ఉంటుంది. లంక భూముల్లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదుచేసే అంశంపై కూటమి ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# తాడిగడప రోడ్లకు మహర్దశ

## రూ.105 కోట్లతో టెండరు పిలిచిన సీఆర్డీఏ

పెనమలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మున్సిపాలిటీలో ప్రజావసరాలకు అత్యంత కీలకమైన నాలుగు రోడ్ల నిర్మాణం, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సీఆర్డీఏ శుక్రవారం రూ.105 కోట్లతో టెండర్లు పిలిచింది. దీంతో రానున్న ఏడాదిలో తాడిగడప మున్సిపాలిటీ.. ముఖ్యంగా కానూరులో రోడ్లకు మహర్దశ పట్టనుంది. తాడిగడప రోడ్ల అభివృద్ధికి సహకరించాలని ఆరునెలల క్రితం తాడిగడప మున్సిపాలిటీలోని వీఆర్ సిద్ధార్థ ఫైవంతెన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. మున్సిపల్ మంత్రి నారాయణను అభ్యర్థించారు. స్పందించిన మంత్రి అక్కడికక్కడే సీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే సీఆర్డీఏ అధికారులు ఈ టెండర్లను ఆహ్వానించారు. బందరురోడ్డు.. ఆర్టీసీ టెర్మినల్ మీదుగా బల్లెంవారి వీధి-ఏలూరు రోడ్డును కలిపే రోడ్డు, బల్లెంవారి వీధి-ఎనికేపాడు రోడ్డును కలిపే మరో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.68 కోట్లు, కానూరు పరిధిలోని మహానాడు రోడ్డును, బల్లెంవారి వీధి మీదుగా పోరంకి-నిడమానూరు రోడ్డును మిగతా 6లో..

# బుడమేరుపై భయమొద్దు

## తెలంగాణ వర్షాలతో బుడమేరుకు సంబంధం లేదు

- బుడమేరు పుట్టింది, ప్రవహించేది ఎన్టీఆర్ జిల్లాలోనే..
- అనేక వాగులు, వంకల సమాహారమే ఈ కాల్వ
- గంపలగూడెం, ఏ.కొండూరు, మైలవరం, జి.కొండూరు
- ఈ నాలుగు మండలాల వర్షపాతంపైనే బుడమేరు వరద
- 20 సెంటీమీటర్ల పైబడి వర్షం కురిస్తేనే వరద వచ్చే చాన్స్

6




తెలంగాణాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటం, వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బుడమేరుకు వరద వస్తుందేమోనని విజయవాడ వాసులు భయాందోళన చెందుతున్నారు. సోషల్ మీడియాలో భయపెట్టేలా పోస్టులు పెడుతుండటంతో ముఖ్యంగా సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు భయాందోళనకు గురవుతుండగా పోలీసులు మైక్ ప్రచారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణాలో భారీ వర్షాలకు, బుడమేరు వరదకు ఎలాంటి సంబంధం లేదు. అక్కడ భారీ వర్షాలు కురిస్తే ఆ వరద నీరంతా వైరా, మునేరుల ద్వారా కృష్ణానదిలోకి వెళ్తుందే తప్ప.. బుడమేరులోకి రాదన్న విషయం విజయవాడ వాసులు గుర్తుంచుకోవాలి.

### జిల్లా అభివృద్ధికి సహకరించండి

- వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో మంత్రి రవీంద్ర

6

### కష్టాల్లో నర్సింగ్ కళాశాల




- సొంత స్థలం లేదు.. భవనాలు లేవు
- చాలీచాలని గదుల్లో విద్యార్థినుల ఇబ్బందులు
- లాకర్లు లేవు, బాత్రూమ్‌లకూ అసౌకర్యమే

8


ఆలయ ప్రాంగణంలో పూలతో ప్రత్యేక అలంకరణ

# పుష్ప శోభితం

» శ్రావణ శుక్రవారం

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, జూలై 25 (ఆంధ్ర జ్యోతి) : ఇంద్రకీలాద్రిపై శ్రావణమాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మ వారి ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కనకదుర్గమ్మ దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. క్యూలైన్లలో పరిస్థితిని, భక్తుల రాకపోకలను ఈవో శీనానాయక్, ఇతర అధికారులు క్రమబద్ధీకరించారు.



**దుర్గామల్లేశ్వరులకు విశేష పూజలు**

ఇంద్రకీలాద్రి క్షేత్రంలో దుర్గామల్లేశ్వరులకు విశేష నిత్య పూజలు వైభవంగా జరిగాయి. కనకదుర్గమ్మకు ప్రీతిపాత్రమైన శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని లక్షకుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కళ్యాణం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**అన్నవితరణకు విరాళాలు**

దుర్గమ్మ నిత్య అన్నప్రసాద వితరణకు కృష్ణాజిల్లా వీరులపాడు మండలం జమ్మవరం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ కృష్ణవేణి, కుటుంబీకులు రూ.1,01,116లు, విజయవాడ వైఎస్సార్ కాలనీకి చెందిన యలమంచిలి నాగశ్రీను రూ.1,01,116లు విరాళాలు అందజేశారు. శుక్రవారం అధికారుల ద్వారా విరాళాలను సమర్పించారు.




దాతలు జొన్నలగడ్డ కృష్ణవేణి, ఎలమంచిలి నాగశ్రీను, కుటుంబ సభ్యులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయఅధికారులు

## శభాష్ టీచర్..

» మీ బోధనపై నమ్మకం ఉంది..

» ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్చిన ఉపాధ్యాయుడు


ఇద్దరు పిల్లలతో అబ్దుల్ హలీం

వత్సవాయి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మా పిల్లలు ప్రముఖ స్కూల్లో చదువుతున్నారు.. మా పిల్లాడికి ఎల్‌కేజీ ఫీజు లక్ష కట్టాం తెలుసా.. అని గొప్పలు చెప్పుకునే ఈరోజుల్లో లక్షల్లో వేతనం వస్తున్నా ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన గుణాత్మక విద్య అందుతుందని, అందిస్తామనే నమ్మకాన్ని కలిగించేలా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అందరికి ఆదర్శంగా నిలిచాడు. వత్సవాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అబ్దుల్ హలీం తన ఇద్దరు పిల్లలు ముజామిల్ హుస్సేన్, ముద్దాసిర్ హుస్సేన్‌లను స్థానిక ఎంపీపీ పాఠశాలలో చేర్పించారు. ఉపాధ్యాయుడిని జడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎన్.అనితతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## అక్షరాంధ్ర.. స్వర్ణాంధ్రకు వెలుగుబాట

» ఆగస్టు 7 నుంచి ఫిబ్రవరి వరకు 100 గంటల తరగతులు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి అక్షరాంధ్ర వెలుగుబాట అని, సమష్టి కృషితో అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. 'ఉల్లాస్-అక్షరాంధ్ర అక్షరాస్యత' కార్యక్రమంపై కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2025-26 సంవత్సరానికి అక్షరాస్యత లక్ష్యాలను చేరుకొనేందుకు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. వయోజనులైన నిరక్షరాస్యులను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గుర్తించడం జరిగిందని, వీరందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్ది జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషిచేయాలన్నారు. అక్షరాంధ్ర అక్షరాస్యత కార్యక్రమం ద్వారా ఈనెల 31 నాటికి మండలాల్లో వలంటీర్ టీచర్లను గుర్తించి, మ్యాచింగ్-బ్యాచింగ్ ద్వారా పదిమందికి ఒక వలంటీర్ టీచర్‌ను మ్యాపింగ్ చేయాలన్నారు. ఈనెల 26 నుంచి 28 వరకు ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం వుంటుందని, తర్వాత మండలస్థాయిలో వలంటీర్ టీచర్లు, రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ కార్యక్రమాలు ఎంపీడీవో అధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఆగస్టు 7 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు 100 గంటల తరగతులు నిర్వహించాల్సి వుంటుందన్నారు. తరగతుల్లో ఫంక్షనల్ లిటరసీతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి జి.ప్రసాదరావు, డీఈవో యూవీ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 5 నుంచి వైద్య శిబిరాలు

» జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ టీడీ జనార్దన్ వెల్లడి



జగ్గయ్యపేట, జులై 25 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో ఆగస్టు 5నుంచి జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నట్టు ఫౌండేషన్ ఛైర్మన్, ఆప్కాబ్ మాజీ ఛైర్మన్ తొండెపు దశరథ జనార్దన్ తెలిపారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పలువురు కౌన్సిలర్లతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 5 నుంచి ఎంపిక చేసిన కేంద్రాల్లో రోజు శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. నేత్ర, దంత, సాధారణ వ్యాధులకు పరీక్షలు జరుపుతారని వివరించారు. పట్టణ ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, గింజుపల్లి వెంకట్రావుతదితరులు పాల్గొన్నారు.


స్వామి వారి ఉత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ అధికారులు

## వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ మహా సంప్రోక్షణ

» నేటినుంచి అష్టబంధన మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం

విజయవాడ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానాల అధ్వర్యంలో విజయవాడ పున్నమ్మతోటలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని ఆలయ పర్యవేక్షకులు ఎం.మల్లిఖార్జున తెలిపారు. మహా సంప్రోక్షణ కార్యక్రమాలను శుక్రవారం మీడియా సమావేశంలో వివరించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం హిందూ దేవాలయాలను ప్రతి 12 ఏళ్లకోసారి మహా సంప్రోక్షణ చేయడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం అధ్వర్యంలో విజయవాడ పున్నమ్మతోటలో టీటీడీ అధికారులు, భక్తులు, దాతల సహకారంతో 2010లో ఆలయ నిర్మాణాన్ని చేపట్టి 2012లో స్వామివారి విగ్రహ ప్రతిష్టగావించడం జరిగిందన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆరు రోజుల పాటు అత్యంత వైభవంగా వెంకటేశ్వరస్వామి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.బాలమురళీకృష్ణ అయ్యంగార్, ఆలయ అర్చకులు వేదాంతం వెంకట శశికిరణ్, ఆలయ ఇనస్పెక్టర్ చేకూరి లలితా రమాదేవి, దాతలు మాకినేని విజయకుమార్, ఆర్.సంజీవరెడ్డి, ఎస్.వేణు, పడవల ఏడుకొండలు, ప్రసాద్, వెంకటేశ్వరరావు, రెడ్డి, శ్రీనివాస్, తులసి, రాజేశ్వరి, శాంతిశ్రీ, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

# ఆవిష్కరణల్లో జిల్లాను నెం.1గా నిలపాలి

» రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో స్టార్టప్‌లకు ప్రోత్సాహం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్), స్పోక్స్ ద్వారా స్టార్టప్‌లకు కొత్త ఊపు రానుందని, ఈ స్పోక్‌ను సద్వినియోగం చేసుకొంటూ జిల్లాను ఆవిష్కరణల్లో నెం.1గా నిలిపేందుకు కృషిచేయనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం వివిధ స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికలకు, కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రాన్ని వేదికగా తీర్చిదిద్దేందుకు అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడం జరుగుతోందని, దీనికి అనుసంధానంగా రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో స్పోక్స్‌లను కేటాయించడం జరిగిందని, ఎన్టీఆర్ జిల్లాకు కూడా ఒక స్పోక్‌ను కేటాయించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. విజయవాడలోని ఎనికేపాడులో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్‌ను త్వరలోనే ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని, ఈ నేపథ్యంలో సన్నద్ధతలో భాగంగా ట్రయలరన్‌గా కలెక్టరేట్ ప్రాంగణంలో దాదాపు 62 స్టార్టప్‌లు తమ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లిక్విడ్-సాలిడ్ వేస్ట్ రీసైకిలింగ్, డ్రోన్స్ యూజ్ కేసులు, అగ్రిటెక్, ఎన్విరాన్ డిజిటల్ వంటి సొల్యూషన్స్‌ను ప్రదర్శించినట్లు వివరించారు. సమాజంలో నిత్య జీవితంలో ఎదురయ్యే వివిధ సమస్యలకు అందరికీ అందుబాటులో వుండేలా కళాశాల విద్యార్థులు, యువత కొత్త ఆలోచనలతో ప్రాజెక్ట్ రూపకల్పన చేస్తున్నారని, వీరికి అన్ని విధాలా ఆర్‌టీఐహెచ్ హబ్, స్పోక్స్‌ల ద్వారా మద్దతు లభిస్తుందన్నారు. చాలా తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉండే టెక్ సొల్యూషన్స్‌ను ప్రోత్సహించి, వివిధ పథకాలను సద్వినియోగం చేసుకొనేలా, బ్యాంకింగ్ మద్దతుకు సహాయ సహకారాలు అందచేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో ఇగ్నైట్ సెల్ ద్వారా వివిధ శాఖల పరిధిలో అందుబాటులో వున్న పథకాలు, వాటిని సద్వినియోగం చేసుకొనేందుకు మార్గాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువతలో శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించి, సరికొత్త ఆవిష్కరణలు దిశగా నడిపించేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ దోహదం చేస్తుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వివిధ స్టార్టప్ సంస్థల ప్రతినిధులు, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు, తదితరులు పాల్గొన్నారు.


స్టార్టప్ కంపెనీల స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియ

# బుడమేరుపై భయమొద్దు

(ఆంధ్ర జ్యోతి, విజయవాడ) : తెలంగాణా ప్రాంతానికి, బుడమేరు పుట్టుక ప్రాంతానికి మధ్యలో ఎత్తయిన కొండలున్నాయి. కాబట్టి తెలంగాణకు, బుడమేరు వరదకు ఎలాంటి సంబంధం లేదు. ఎన్టీఆర్ జిల్లాలో కురిసే భారీ వర్షాలకే బుడమేరు పొంగుతుంది. జిల్లాలోని గంపలగూడెం, ఏ.కొండూరు, రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు.. ఈ నాలుగు మండలాల పరిధిలో అత్యంత భారీ వర్షాలు కురిస్తేనే బుడమేరు ఉప్పొంగుతుంది. ఈ మండలాల పరిధిలో కిందటి సెప్టెంబరులో ఒక్క రోజులో 30 సెంటీమీటర్ల మేర వర్షం కురవటం వల్ల బుడమేరు ఉగ్ర రూపం దాల్చింది.

**బుడమేరు పుట్టింది ఎన్టీఆర్ జిల్లాలోనే..**

బుడమేరు పుట్టుక మన జిల్లాలోనే జరిగింది. ఏ.కొండూరు మండలం జమ్మలవాయి దుర్గం కొండపై బుడమేరు పుట్టింది. ఈ కొండపై పడిన వర్షపు నీరు, గంపలగూడెం మండలంలో కురిసిన వర్షపు నీటితో బుడమేరు ప్రారంభమవుతుంది. ఇలా కొంతదూరం ప్రయాణించాక పలు ప్రాంతాల్లో అనేక వాగులు, వంకలు కలుస్తాయి. ఇవన్నీ పొంగి పొర్లినపుడు బుడమేరు మహోగ్రరూపం దాల్చుతుంది. జమ్మలవాయిదుర్గం నుంచి ప్రవహించాక బుడమేరు చీమలపాడు దగ్గర పాలవాగులో కలుస్తుంది. అక్కడి నుంచి ఒక పాయ విడిపోయి మైలవరం మండలం మెర్సుమల్లి కొండవాగు, అనంతవరం కొండవాగు, మైలవరం కొండవాగు వద్ద జి.కొండూరు చేరుతుంది. మరో పాయ కూడా కూనపరాజుపర్వ నుంచి కొండవాగు, రెడ్డిగూడెం నుంచి వచ్చే కోతుల వాగులో కలిసి జి.కొండూరు చేరుతుంది. ఇక్కడే రెండు పాయలు కలిసి బుడమేరుగా రూపాంతరం చెందుతాయి. ఇక్కడి నుంచి బుడమేరు వెల్లటూరు, కందులపాడు, హెచ్.ముత్యాలంపాడు మీదుగా ముందుకు వెళ్తుంది. వెల్లటేరు వద్ద కొండవాగు ఒకటి కుంటముక్కల చెరువులో కలుస్తుంది. ఆ చెరువు నిండినపుడు నీరంతా బుడమేరులో చేరుతుంది. వెలగలేరు హెడ్ రెగ్యులేటరీ దగ్గరకు వచ్చేసరికి కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ నుంచి పులివాగు వచ్చి బుడమేరులో మిళితమవుతుంది. ఇక్కడి నుంచి బుడమేరు డైవర్షన్ చానల్ ద్వారా ఎన్టీటీపీఎస్ మీదుగా వరదను కృష్ణానదిలో కలుపుతారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటరీ సామర్థ్యానికి మించి వరద వస్తే రెగ్యులేటరీ గేట్లు పైకెత్తి నీటిని దిగువకు వదులుతారు. ఇలా వెళ్లే ప్రవాహంలో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ నుంచి వచ్చే కప్పలవాగు (వినపాక), తొమ్మండ్రువాగు (కట్టుబడిపాలెం) కూడా కలుస్తాయి. విజయవాడ దిగువన ఉండే కుంపిణీ వాగు బ్రహ్మయ్యలింగం చెరువులోకి వస్తుంది. బ్రహ్మయ్యలింగం చెరువు పొంగితే చీమలవాగు ద్వారా పోలవరం కాల్వ దిగువన ఉన్న యూటీ నుంచి పురుషోత్తపట్నం చెరువులోకి వెళ్తుంది. ఆ చెరువు పొంగితే ముస్తాబాద మీదుగా బుడమేరులో కలుస్తుంది. ఈ చెరువు నుంచి వచ్చే మరో పాయ పురుషోత్తపట్నం రైల్వేగేటు సమీపం నుంచి జక్కులనెక్కలం మీదుగా బుడమేరులో కలుస్తుంది. ఇక అక్కడి నుంచి బుడమేరు విజయవాడ, ఎనికేపాడు యూటీ మీదుగా కొల్లేరు చేరుతుంది.

**అపోహలొద్దు**

బుడమేరు ప్రవాహం అనేది అనేక వాగులు, వంకలు, చెరువుల సమాహారం. కొండవాగులు, రిజర్వు ఫారెస్ట్ నుంచి వచ్చే వాగులు, ఇతర వాగులన్నీ కలిస్తే బుడమేరు మహోగ్రరూపం దాల్చుతుంది. కాబట్టి ఆయా మండలాల్లో గరిష్ఠంగా 20 సెంటీమీటర్ల పైబడి వర్షం కురిస్తే తప్ప వరద వచ్చే పరిస్థితి ఉండదు. తెలంగాణా ప్రాంతంలోని భారీ వర్షాలు, వాగుల ఉధృతిని చూసి బెజవాడ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో జరిగే ప్రచారాలను నమ్మకుండా మన జిల్లాలో కురిసే వర్షపాతం ప్రాతిపదికన బుడమేరు వరదను అంచనా వేయొచ్చు.

# మూడేళ్లలో మెట్రో

(5వ పేజీ తరువాయి)

మెట్రో ప్రాజెక్టుల నిర్మాణం, పర్యవేక్షణ, సాంకేతిక సహకారం, నిర్వహణ వంటి సేవలను టిప్సా, శిస్త్రా సంస్థలు అందించాల్సి ఉంటుంది. ఇందుకుగాను టిప్సా సంస్థకు రూ.188 కోట్లు, శిస్త్రా సంస్థకు రూ.214 కోట్లు చెల్లించేందుకు ఏపీఎంఆర్‌సీఎల్ నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పి.నారాయణ సమక్షంలో ఎంఓయూ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సత్వర రవాణా వ్యవస్థలను ప్రజలకు అందించటం కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మెట్రో రైల్ ప్రాజెక్టులకు శ్రీకారం చుడితే వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ మెట్రో ప్రాజెక్టులను గాడిన పెడుతున్నామన్నారు. నగరాలలో పెరుగుతున్న వాహనాలు, ట్రాఫిక్ సమస్యలకు మెట్రో రైళ్ల మాత్రమే పరిష్కారమన్నారు. దీనిని గుర్తించి ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా కూడా విజయవాడ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టులను పట్టాలెక్కించాలన్న ఉద్దేశంతో వాటికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. విశాఖపట్నం మెట్రో టెండర్లను పిలిచామని, విజయవాడ మెట్రో టెండర్లు కూడా కొద్ది రోజుల్లో ఆహ్వానిస్తామని చెప్పారు. విశాఖపట్నంలో రూ.11,498 కోట్ల అంచనా వ్యయంతో, విజయవాడలో రూ.10,118 కోట్ల అంచనా వ్యయంతో మెట్రో రైల్ ప్రాజెక్టును చేపడుతున్నామని నారాయణ వెల్లడించారు. రెండు మెట్రో ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం 20 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం, మిగిలిన 60 శాతం కేంద్ర ప్రభుత్వం ఇప్పించే రుణంతో చేపట్టనున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ 20 శాతం వాటాగా విజయవాడలో ఏపీసీఆర్డీఏ, విశాఖలో వీఎంఆర్డీఏ ద్వారా నిధులు సమకూర్చనున్నట్టు తెలిపారు. విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా ఫేజ్-1 లో 3 కారిడార్లుగా 46.23 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 34.40 కిలోమీటర్ల మేర 29 స్టేషన్లతో కారిడార్-1, గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకు 5.07 కిలోమీటర్ల మే 6 స్టేషన్లతో కారిడార్-2, తాడిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకు 6.75 కిలోమీటర్ల మేర 7 స్టేషన్లతో కారిడార్-3 పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. తాటిచెట్లపాలెం నుంచి మధురవాడ వరకు 20 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ లైన్ వస్తుందని తెలిపారు. విశాఖ మెట్రో కోసం కేంద్ర నిధులు రూ.2018 కోట్లు, రాష్ట్ర నిధులు రూ.2863 కోట్లు, భూ సేకరణకు రూ.847 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. విజయవాడ మెట్రో రైలుకు మొదటి దశలో 35.04 కిలోమీటర్ల మేర పనులు చేపడుతున్నట్టు చెప్పారు. గన్నవరం బస్‌స్టేషన్ నుంచి పీఎన్‌బీఎస్ వరకు 25.95 కిలోమీటర్ల పొడవున కారిడార్-1, పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్‌కు వరకు 12.45 కిలోమీటర్ల చొప్పున కారిడార్-2 మొత్తంగా 33 స్టేషన్లతో నిర్మించనున్నట్టు చెప్పారు. విజయవాడ మెట్రో భూ సేకరణకు రూ.1152 కోట్ల మేర ఖర్చు అవుతుందని నారాయణ వెల్లడించారు. రుణంగా తీసుకునే మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ చెల్లిస్తుందని తెలిపారు. విశాఖ మెట్రోకు 99.75 ఎకరాలు, విజయవాడ మెట్రో 91 ఎకరాల భూములు అవసరమౌతున్నాయని, భూ సేకరణకు నోటీసులు ఇచ్చామని తెలిపిన మంత్రి మూడేళ్లలో మెట్రో రైల్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు.

# వేగం పెంచాలి

(5వ పేజీ తరువాయి)

నమోదుచేసే సమయంలో రైతులు అందుబాటులో లేకున్నా, పొలంలో వాస్తవంగా ఏయే రకాల వంగడాలు సాగు చేశారో నమోదు చేసే వెసులుబాటు ఇచ్చారు. యజమాని తన పొలాన్ని కౌలుకు ఇస్తే.. కౌలురైతుల పేరుతోనే నమోదు చేయాల్సి ఉంది.

జిల్లాలో కౌలురైతు గుర్తింపుకార్డులను 57 వేల మందికే ఇచ్చారు. వారిపేరున ఈ-క్రాప్‌లో పంట వివరాలు ఎంతమేరకు నమోదు చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. భూమి సాగు చేస్తున్న వారి పేరు, సర్వే నెంబరు, రైతుల బ్యాంకు ఖాతాల నెంబర్లను ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయాలి. గతంలో పొలం వద్దకు వెళ్లకుండానే ఈ-క్రాప్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. దీంతో రైతులు పంటను విక్రయించే సమయంలో, అనుకోని పరిస్థితుల్లో నష్టపోతే నష్టపరిహారం, బీమా పొందేందుకు దరఖాస్తు చేసుకునే సమయంలో ఇబ్బందులు పడేవారు. దీంతో ఈ ఏడాది ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేయాలంటే వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, వీఆర్వోలు కచ్చితంగా పొలం వద్దకు వెళ్లాలనే నిబంధన విధించారు.

అంతకుముందు ఆయా గ్రామాలను మ్యాపింగ్ చేసుకోవాలి. ఇందుకు సంబంధించిన డేటాను వెబ్‌ల్యాండ్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం రైతులు అందుబాటులో ఉంటే వారిని పొలం వద్దకు పిలిచి, భూమి సర్వే నెంబర్లు, విస్తీర్ణం, రైతుల ఆధార్ కార్డుల నెంబర్లు, మనుగడలో ఉన్న బ్యాంకు ఖాతాల నెంబర్లు, సాగు చేసిన వరి వంగడాల వివరాలు సక్రమంగా ఉందీ, లేనిది సరిచూసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

## ఏసీబీ వలలో సీనియర్ అసిస్టెంట్

» రూ.40వేలు లంచం తీసుకుంటూ చిక్కిన వైనం


సీనియర్ అసిస్టెంట్ త్రినాథ్

మచిలీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, ఆర్డీవో సీసీగా పనిచేస్తున్న బీరం త్రినాథ్ రూ.40 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కటం సంచలనం రేకెత్తించింది. ఏసీబీ డీఎస్పీ బీవీ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నంకు చెందిన కొల్లిపర వెంకట లక్ష్మీనారాయణ అరిసేపల్లిలో తనకు ఉన్న భూమిలో కొంతభాగాన్ని ఇద్దరు కుమార్తెలకు ఇచ్చాడు. ఈ భూమిని ఇతరత్రా అవసరాల కోసం వాడుకునేందుకు ల్యాండ్ కన్వర్షన్ నిమిత్తం రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫీజు చెల్లించాడు. మచిలీపట్నం నార్త్ తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫైలు ఆర్డీవో కార్యాలయానికి చేరింది. ఈ ఫైలుపై సంతకం చేయించేందుకు ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ త్రినాథ్ రూ.42వేలు డిమాండ్ చేశాడు. దీంతో వెంకట లక్ష్మీనారాయణ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం రాత్రి ఆర్డీవో కార్యాలయంలో లక్ష్మీనారాయణ సీనియర్ అసిస్టెంట్‌కు నగదు ఇస్తుండగా.. పథకం ప్రకారం ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. కొంతకాలంగా ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించి రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎంత నగదు చెల్లిస్తే, అంతే మొత్తంలో తమకు నగదు చెల్లించాలని డిమాండ్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎట్టకేలకు ఏసీబీ అధికారులు దాడి చేసి సీనియర్ అసిస్టెంట్‌ను నగదు తీసుకుంటుండగా పట్టుకోవటం గమనార్హం.

## లంచం కేసులో వీఆర్వోకు రెండేళ్ల జైలు

విజయవాడ లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ కేసులో వత్సవాయి మండలం మక్కపేట గ్రామ వీఆర్వో వడ్లమూడి వెంకట నరసింహ వైకుంఠరావుపై నేరం రుజువుకావడంతో రెండేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి భాస్కరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఉమ్మడి కృష్ణాజిల్లా వత్సవాయి మండలం, గోపినేని పాలెం గ్రామానికి చెందిన కొల్లా వీరయ్య అదే మండలం మక్కపేట గ్రామంలో తన పూర్వీకుల ద్వారా వచ్చిన 9.12 ఎకరాల భూమికి పట్టాదారు పాస్ పుస్తకం, యాజమాన్య హక్కు పత్రం (టైటిల్ డీడ్)లను ఇవ్వాల్సిందిగా వత్సవాయి మండల తహసిల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మక్కపేట వీఆర్వో వడ్లమూడి వెంకట నరసింహ వైకుంఠరావు దరఖాస్తును పై అధికారులకు పంపడానికి గాను బాధితుడి నుంచి రూ.8 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు విజయవాడ అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించారు. బాధితుడి నుంచి లంచం తీసుకొంటుండగా పట్టుకొని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

## సీఎస్‌ను కలిసిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు

వన్‌టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 5న రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కె.ఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో 23 మంది కార్యవర్గం సభ్యులు విజయానంద్‌ను సాదరపూర్వకంగా సత్కరించారు. ఇదే సమయంలో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఆయన దృష్టికి తెచ్చారు. సాంకేతిక విద్యాశాఖలో పాలటెక్నిక్‌లో పనిచేసే టీచింగ్, అకడమిక్ స్టాఫ్‌కు వేతన బకాయిలు రూ.191.13కోట్లు విడుదల చేయాలని కోరారు. మంగళగిరి ఎయిమ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కింద వైద్యం చేయించటం కోసం కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడాలని కోరారు. రాష్ట్రంలో గుర్తింపు సంఘాల వ్యవస్థను క్రమబద్ధీకరించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. 2 లేదా 3 సంవత్సరాలకు ఒకసారి ప్రధాన గుర్తింపు సంఘాన్ని నేరుగా ఉద్యోగులు ఎన్నుకునేలా ఒక విధానాన్ని రూపొందించాలని, దీనికోసం సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యులైన ప్రభుత్వ ప్రతినిధులు, ఉద్యోగ సంఘ ప్రతినిధులతో ఒక జాయింట్ వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయాలని కోరారు. సీఎస్ ఆధ్వర్యంలో ప్రతి నాలుగు నెలలకు ఒకసారి జరిగే రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు జరగటం లేదని, వీలైనంత త్వరగా ఈ సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పక్షాన మొత్తం 27 అంశాలను పరిష్కరించాల్సిందిగా కోరుతూ జాబితాను ప్రధాన కార్యదర్శికి అందజేశారు. దీనిపై సీఎస్ స్పందిస్తూ రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించేందుకు కసరత్తు జరుగుతుందని, సమస్యల పరిష్కారంలో తీసుకున్న చర్యలపై సమీక్షిస్తున్నామని, త్వరలోనే అన్ని శాఖల కార్యదర్శుల సమావేశం జరుగుతుందని, ఆ తరువాత జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కె.ఆర్.సూర్యనారాయణతో పాటు ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కుమార్, సహా అధ్యక్షురాలు బి.సుగుణ, ఉపాధ్యక్షుడు కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి సహకరించండి

» వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా అభివృద్ధికి వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు కృషిచేయాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం మచిలీపట్నంలోని క్యాంపు కార్యాలయం వద్ద వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలోని రైతుబజార్లలో సదుపాయాలు మెరుగుపర్చాలన్నారు. రోడ్లపై పశువుల సంచారాన్ని నివారించేలా చర్యలు చేపట్టాలన్నారు. క్యాటిల్ షెడ్లలకు పశువులను తరలించి వాహనదారులకు ఇబ్బందిలేకుండా చూడాలన్నారు. రోడ్లపై తిరిగే పశువుల యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. పి-4 కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ ఎల్.నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

## తాడిగడప రోడ్లకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

కలిపేందుకు రూ.30 కోట్లు, పంటకాల్వ రోడ్డు పొడిగింపుగా సాలిపేట రోడ్డు నుంచి గంగూరు వరకు రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణానికి రూ.6.2 కోట్లు కేటాయించారు. టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే పనులు మొదలుపెడతారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ తన అభ్యర్థనను మన్నించి రోడ్ల నిర్మాణానికి సహకరించిన మంత్రి నారాయణకు, సీఆర్డీఏకు కృతజ్ఞతలు తెలిపారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 232 |
| చికెన్ స్కిన్‌లెస్ | 242 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

## బోడె చొరవతో కానూరు ప్రధాన రహదారికి మరమ్మతులు

● రెండు రోజులు దగ్గరుండి పనులు చేయించిన ఎమ్మెల్యే

**కానూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :** రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కెనడీ హైస్కూల్ - ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ మధ్య కానూరు మెయిన్‌రోడ్డుపై రెండు నుంచి మూడు అడుగులు వర్షపునీరు చేరి జనజీవనం అతలాకుతలం అవడంతో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చొరవ తీసుకున్నారు. ఆయన రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆ రోడ్డులోనే ఉండి యుద్ధప్రాతిపదికపై రోడ్డు మరమ్మతు పనులు చేయించారు. తాను దగ్గరుండి పర్యవేక్షిస్తూ కంకర, ఇసుక లారీలను వెంట వెంటనే తెప్పించి రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రజల కష్టాలు తీర్చారు. పనులను చురుకుగా చేయించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇల్లు తగులబెట్టిన కేసులో నిందితుడికి జైలు

**ఉయ్యూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :** పినతల్లి నివాసముంటున్న ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన వ్యక్తికి లక్ష రూపాయలు జరిమానా, ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ ఏడవ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి తీర్పు ఇచ్చినట్టు ఉయ్యూరు రూరల్ పోలీసులు తెలిపారు. ఆకునూరులో 2024వ సంవత్సరంలో ఒంటరిగా జీవిస్తున్న బొంతు ప్రమీల ఇంటిపై బొంతు సిరిల్‌బాబు పెట్రోల్ పోసి నిప్పుపెట్టి ఇల్లు, ఇంటిలో సామాను తగులబెట్టాడు. ప్రమీల చేసిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు వాదనల అనంతరం నిందితుడికి జరిమానా, జైలుశిక్ష విధిస్తూ జడ్జి శుక్రవారం తీర్పు ఇచ్చినట్టు రూరల్ ఎస్సై కె.సురేశ్‌కుమార్ తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన పాలడుగు, స్టాన్లీజోన్స్‌బాబు, కనక దుర్గారావు

### చినఓగిరాల సొసైటీ ఛైర్‌పర్సన్‌గా
## పాలడుగు ప్రమాణస్వీకారం

**ఉయ్యూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :** చినఓగిరాల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం (పీఏసీఎస్) పాలకవర్గ సభ్యులు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. సంఘం ఛైర్‌పర్సన్‌గా గ్రామ మాజీ సర్పంచ్ సీనియర్ టీడీపీ నాయకుడు పాలడుగు రామకృష్ణ, డైరెక్టర్లుగా మొగదాటి స్టాన్లీ జోన్స్ బాబు, కనకదుర్గారావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాలడుగు మాట్లాడుతూ రైతు లకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు సక్రమంగా అందేలా పనిచేసి ప్రభుత్వానికి, పార్టీకి మంచి పేరు తీసుకువస్తామని, రైతులకు మెరుగైన సేవలందించి మన్ననలు పొందుతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ కె.ప్రవీణ్, పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, సర్పంచ్ యెనిగళ్ల శిరీష, మాజీ సర్పంచ్ నాగభూషణం, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే బోడెను విమర్శించే స్థాయి
## వైసీపీ నాయకులకు లేదు

టీడీపీ కంకిపాడు నేతలు

**కంకిపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :** ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను విమర్శించే స్థాయి ప్రస్తుత వైసీపీ నాయకులకు ఎక్కడుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2014 - 19 మధ్య జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో గెలుపొందిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అని 2019లో తక్కువ ఓట్లతో ఓడిపోయారన్నారు. ఓడిన నాటి నుంచి ఇంట్లో కుర్చోకుండా ప్రజల మధ్యనే ఉంటూ ప్రజాసమస్యలపై పోరాడారని కొనియాడారు. అధికారంలో ఉన్నా లేకుండా నిత్యం ప్రజల మధ్యలో ఉండే వ్యక్తి అని, అలాంటి నాయకుడిని వైసీపీ చోటా నాయకులు విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్క రోడ్డు కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నియోజకవర్గంలో సుమారు రూ. 75 కోట్లతో అనేక గ్రామాల్లో రహదారులు, డ్రైన్లు అభివృద్ధి చేసి చూపించారన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాస రావు, స్థానిక టీడీపీ నాయకులు చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, వీరంకి శ్యామ్, బాజి తదితరులు పాల్గొన్నారు.



## ఆలయాల్లో శ్రావణ శోభ

**కూచిపూడి, జూలై 25(ఆంధ్రజ్యోతి):** శ్రావణ మాసం మొదలు కావటంతో శుక్రవారం గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. శ్రావణ శుద్ధ పాడ్యమి శుక్రవారం( తొలి రోజు) దేవాలయాలు మహిళలతో కళకళలాడాయి. కూచిపూడి గంగాబాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు శ్రావణలక్ష్మిగా దర్శనమిచ్చారు. పెదపూడి, మొవ్వ, గూడపాడు, మొవ్వపాలెం, కోసూరు, కాజ, నిడుమోలు, చినముత్తేవి, అయ్యంకి శివాలయాల్లో విశేష పూజలు జరిపారు.

## కొండాలమ్మకు ప్రత్యేక పూజలు

**గుడ్లవల్లేరు :** శ్రావణ మాసం తొలిరోజు తొలి శుక్రవారం కావడంతో వేమవరం కొండాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర కుంకమార్చన, అమ్మవారికి పంచామృత అభిషేకం చేసి, సాయంత్రం పంచహారతి ఇచ్చారు. ఆలయ అలివేటి మండపంలో ఉత్సవమూర్తికి నిర్వహించిన ప్రత్యేక పూజాకార్యక్రమాలలో ఆలయ ఈవో ఎ.కొండలరావు దంపతులు పాల్గొన్నారు.

# అమ్మబోతే అంగడి లేదు!

- జంక్షన్‌లో రైతుబజారు లేక రైతుల ఇక్కట్లు
- మార్కెట్‌లో మండుతున్న ధరలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు



జంక్షన్‌లో కొనసాగుతున్న ప్రైవేట్ కూరగాయల మార్కెట్

**(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి)**

కూరగాయలు పండించే రైతులకు గిట్టుబాటు, ప్రజలకు సరసమైన ధరకు అందించాలన్న రైతు బజార్ లక్ష్యం హనుమాన్‌జంక్షన్‌లో మరుగున పడింది. ప్రభుత్వ రైతుబజార్ మూతపడి దాదాపు 15ఏళ్లు అవుతోంది. ప్రజానీకం బయట మార్కెట్‌పై ఆధారపడాల్సి వస్తోంది. 1998లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నూజివీడు రోడ్డులో వేంకటేశ్వరస్వామి దేవస్థానం పక్కన ప్రైవేట్ స్థలాన్ని లీజుకు తీసుకుని రైతు బజార్ ఏర్పాటు చేసింది. 2011 వరకు సాగింది. ప్రజలకు సరసమైన ధరలకు కూరగాయలు లభించేవి. ప్రభుత్వం లీజు చెల్లించక పోవడంతో సదరు యజమాని స్థలాన్ని ఖాళీ చేయించారు. దీంతో అప్పటి అధికారులు ప్రజలకు రైతుబజార్ సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశంతో బాపులపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రభుత్వ స్థలంలో లక్షలాది రూపాయలు వెచ్చించి రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి వరకు జంక్షన్ నడిబొడ్డున సౌకర్యవంతంగా నిర్వహించిన రైతుబజార్ ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో ప్రజలకు, రైతు బజార్‌లో వ్యాపారాలు నిర్వహించే వారికి మింగుడు పడలేదు. దూరంగా ఉన్న రైతు బజార్‌కు వెళ్లలేక దగ్గరలో ఉన్న ప్రైవేట్ దుకాణాలపై ఆధారపడ్డారు. దీంతో ప్రభుత్వ రైతుబజార్ ఆదరణ కోల్పోయింది. దీంతో ఖాళీ చేసిన ప్రైవేట్ స్థలంలోనే తిరిగి వ్యాపారస్తులు అద్దెకు తీసుకుని దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగించడం ఆరంభించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ రైతుబజార్ ఆదరణ కోల్పోయి క్రమంగా ఏడాది కాలంలోనే మూత పడింది. అధికారులు కూడా పట్టించుకోలేదు. దీంతో దాదాపు 15 ఏళ్లుగా జంక్షన్, చుట్టుపక్కల గ్రామస్తులు కూరగాయలకు ప్రైవేట్ దుకాణాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. చుట్టు పక్కల గ్రామాల్లో కూరగాయలు పండుతున్నా జంక్షన్ మార్కెట్‌లో కొనలేని విధంగా ధరలు పలుకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజార్ లేకపోవడంతో గత్యంతరం లేక మార్కెట్‌పైనే ఆధారపడాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రైతుబజార్‌ను ఏర్పాటు చేయాలని ప్రజానీకం కోరుతున్నారు.

# మునిసిపాలిటిలో రోడ్లన్నీ పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పోరంకిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**పెనమలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :** తాడిగడప మునిసిపాలిటీలోని నాలుగు క్లస్టర్లలోని అన్ని రోడ్లను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం పోరంకి సీతాపురం కాలనీ శ్రీనివాసనగర్‌లో రూ. 27 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. అభివృద్ధి జరగడంలేదని విమర్శించే వైసీపీ నాయకులు ఇళ్ల నుంచి బయటికి వచ్చి మునిసిపాలిటీ అంతా తిరిగి చూసి మాట్లాడాలని, కళ్లులేని కబోదుల్లా విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. నిన్నగాక మొన్న రాజకీయాల్లోకి వచ్చిన వాళ్లు కూడా అభివృద్ధి గురించి మాట్లాడడం తగదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి చేస్తున్న అభివృద్ధిని కళ్లతో చూడాలన్నారు. మునిసిపాలిటీలో చాలా ఇబ్బందులున్నాయని.. తాను అన్ని పనులూ పూర్తి చేశానని చెప్పడం లేదని, ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేసేందుకు తాను శతవిధాలా ప్రయత్నిస్తానని తెలిపారు. చాలా ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు సరిగా లేని విషయం వాస్తవమేనన్నారు. గత ప్రభుత్వం ఏ ఒక్క అభివృద్ధి పనీ చేయలేక చతికిల పడడంతో మునిసిపాలిటీ అభివృద్ధి కుంటుపడిందని, ఇలాంటి పరిస్థితుల్లో ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేసే బాధ్యత తను తాను తీసుకొన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, కమీషనర్ షేక్ నజీర్, జనసేన నేత తాతపూడి గణేష్, కూటమి నాయకులు, మహిళానేతలు పాల్గొన్నారు.

● సీఎం చంద్రబాబు పీ4 కార్యక్రమంపై నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధికారులతో కలిసి పాల్గొన్నారు.

# ప్రయాణం ప్రాణ సంకటం!

అధ్వానంగా గోసాల - వణుకూరు - మద్దూరు ప్రధాన రహదారి



గోతులమంగా గోసాల - వణుకూరు - మద్దూరు ప్రధాన రహదారి

**(కంకిపాడు - ఆంధ్రజ్యోతి)**

అధ్వానంగా ఉన్న పలు ప్రధాన రహదారులపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా ఉన్న రహదారులు అభివృద్ధి చేయాలంటూ ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను వేడుకుంటున్నారు. మండలంలోని గోసాల - వణుకూరు - మద్దూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. గోసాల మొదలకొని మద్దూరు కరకట్ట వరకు ఉన్న సుమారు మూడు కిలో మీటర్ల మేర ఉన్న ప్రధాన రహదారి పరిస్థితి తలుచుకుంటేనే భయమేస్తుందని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గోసాల, వణుకూరు, మద్దూరు గ్రామాల పరిధిలో వేల సంఖ్యలో వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిపై ప్రాణాలు గుప్పట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు.

**దూరమైనా రొయ్యూరు మీదుగా ..**

మద్దూరు - గోసాల ప్రధాన రహదారి పరిస్థితి అధ్వానంగా ఉండటంతో మద్దూరు గ్రామస్థులు గోసాల మీదుగా కంకిపాడు, విజయవాడ వెళ్లటం మానివేశారు. మద్దూరు గ్రామస్థులు అధిక శాతం మంది దూరమైన రొయ్యూరు - గొడవర్రు మీదుగా కంకిపాడు, విజయవాడ వెళ్తున్నారు. ఈ రహదారి అభివృద్ధి పరిచేందుకు ఎమ్మెల్యే తక్షణమే చర్యలు చేపట్టాలని మద్దూరు గ్రామస్థులు కోరుతున్నారు. ఏది ఏమైనా రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి.

# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య

బాపులపాడులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వద్రాణం హరిబాబు



టీడీపీ జంక్షన్ పట్టణ కార్యాలయంలో నాయకులతో మాట్లాడుతున్న వద్రాణం హరిబాబు

**హనుమాన్‌జంక్షన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :** వైసీపీ ప్రభుత్వ హయాంలో భ్రష్టు పట్టిన ప్రభుత్వ విద్యా వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టి ఉజ్వల భవిష్యత్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ వద్రాణం హరిబాబు తెలిపారు. శుక్రవారం బాపులపాడులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో హరిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరి బాబు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో ప్రభుత్వ విద్యాసంస్థలు ఆ పార్టీ రంగులతో రాజకీయ కార్యాలయాలుగా మారాయన్నారు. మంత్రి లోకేశ్ నాయకత్వంలో కార్పొరేట్ విద్యా సంస్థల్ని తలదన్నే విధంగా మార్చివేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాపుల పాడు మండల అధ్యక్ష కార్యదర్శులు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాస రావు, నాయకులు చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయికల్యాణి, చిన్నాల లక్ష్మీనారాయణ, గార్లపాటి రాజేశ్వరరావు, గండేపూడి నితీష్‌కుమార్, కర్రా ప్రసాద్ పాల్, మొవ్వా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● ఉమామహేశ్వరపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆ గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వద్రాణం హరిబాబుతో పాటు గ్రామ నాయకులు ఆర్నేపల్లి సూరిబాబు, గండి రాంబాబు, ఆర్నేపల్లి వెంకటేశ్వరరావు, పాండు రంగారావు, చిలకపాటి శ్రీనివాసరావు, రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**రూ.100 కోట్లతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం**

**ఉయ్యూరు :** నియోజక వర్గంలో వంద కోట్ల రూపాయలతో డ్రెయినేజీలు, అంతర్గత రోడ్ల నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చినఓగిరాలలో పర్యటించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఇంటింటా ప్రచారం చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ యెనిగళ్ల శిరీష, ఏఎంసీ ఛైర్మన్ కె.ప్రవీణ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

**ప్రసాదంపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.14.30 లక్షల ఎల్‌వోసీలు, చెక్కులను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రోగుల కుటుంబ సభ్యులకు శుక్రవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి వరమని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. పేద రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం



**పెనమలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :** యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా పార్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం నిర్వహించారు. అనంతరం పార్వతీదేవికి ప్రత్యేక అలంకరణ గావించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రధానార్చకులు సాగర్ ప్రత్యే పూజల్లో నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహరావు దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో భవాని పర్యవేక్షించారు.

### తిరుపతమ్మ ఆలయంలో..



**గన్నవరం :** పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుప తమ్మ ఆలయంలో మొదటి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుత ఆలయ సంప్రదాయం ప్రకారం మాను(మహాలక్ష్మి)కు భక్తులు తొలిపూజ నిర్వహించారు. గ్రామపెద్దలు కాసనేని బాబూరావు, బేబీసరోజిని దంపతులు అమ్మవారి సన్నిధిలో శ్రావణమాసం సందర్భంగా లక్ష్మీసహస్రనామ పారాయణం దీక్షకు కలశస్థాపన చేశారు. లక్ష్మి అష్టోత్తరం, హనుమాన్ చాలీసా పారాయణం, కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి కల్యాణ వేదికలో దాత జాస్తి శ్రీధర్ ఆర్థిక సాయంతో అన్నసమారాధన చేశారు. అల్లాపురం శంకర్, పడమట సుబ్రహ్మణ్యం, ఈడే సుబ్బారావు, చిమట శ్రీనివాసరావు, మోదుగుమూడి వేణుగోపాలరావు, ఈడే వీరాస్వామి, అవుటపల్లి పార్థసారథి, సురేంద్ర, జలసూత్రం రంగారావు, జమలయ్య, శంకర్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. గ్రామ సంబరాన్ని శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తునట్లు కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు.




సమస్య పరిష్కారం కోరుతూ సిటీ సివిల్ కోర్టుల వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

## న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలి

● ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్

విజయవాడ లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలని, ఖాళీగా వున్న న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో శుక్రవారం సిటీ సివిల్ కోర్టుల వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నూతన భవనాలు నిర్మించాలని, న్యాయమూర్తుల సంక్షేమ నిధి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంటు బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పేద న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. బెజవాడ బార్ అధ్యక్షుడు ఎ.కె. బాషా మాట్లాడుతూ న్యాయవాదులు చేపట్టిన కార్యక్రమాలకు వెన్నంటి వుంటామన్నారు. ఐఏఎల్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.షరీఫ్, ఉపాధ్యక్షుడు కె.వి.వి. పరమేశ్వరరావు, కె.సుధాకరరాజు, బోను జయమ్మ, ఈఎస్ ప్రసాద్, జీవీ రాజు, నవనీతం సురేష్, జె.వి.రావు, ఎఎస్ఎస్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

## స్పోర్ట్స్ డే ప్రతిష్ఠాత్మకంగా జరుపుతాం

విజయవాడ (స్పోర్ట్స్), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టు 29న స్పోర్ట్స్ డే ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. స్టేడియంలోని శాప్ కార్యాలయంలో శుక్రవారం స్పోర్ట్స్ డే నిర్వహణపై శాప్ ఎండీ అజయ్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పోర్ట్స్ డే రోజున క్రీడా విజయాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను సన్మానిస్తామన్నారు. జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు కసరత్తు చేస్తున్నామన్నారు. శాప్ ఎండీ అజయ్ జైన్ మాట్లాడుతూ స్పోర్ట్ డే విజయవంతం చేయడానికి క్రీడా సదుపాయల కల్పన, ఏర్పాట్లపై శ్రద్ధ వహించాలని సూచించారు.

## ఫిడే ఫైనల్‌లో హంపి విజయం సాధించాలి

జార్జియాలో జరుగుతున్న ఫిడే మహిళలు వరల్డ్ కప్‌లో భారత మహిళా గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఫైనల్‌కు చేరుకోవడం హర్షణీయమని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. సెమీఫైనల్ మ్యాచ్‌లో చైనాపై విజయం సాధించి వరల్డ్ కప్ ఫైనల్‌లో అడుగుపెట్టిన తొలి ఇండియన్‌గా హంపి ఘనత సాధించిందన్నారు. ఈ సందర్భంగా హంపికి అభినందనలు తెలిపారు. వరల్డ్ కప్ ఫైనల్‌లో హంపి విజయం సాధించి చరిత్ర సృష్టించాలని ఆకాంక్షించారు.




తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

## 10వ జాతీయ ఓపెన్ తైక్వాండో పోటీలు ప్రారంభం

విజయవాడ (స్పోర్ట్స్), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి పుట్టిన ఊరుకి, జిల్లాకి, రాష్ట్రానికి, దేశానికి పేరు తెవాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో 10వ జాతీయ ఓపెన్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుంటూ కెరీర్ పరంగా ఉన్నతంగా ఎదగాలన్నారు.



పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న కబడ్డీ క్రీడాకారులు

## యువ ఆంధ్రా కబడ్డీ చాంపియన్‌షిప్ జట్ల ఎంపికకు మంచి స్పందన

లబ్బీపేట (స్పోర్ట్స్), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : యువ ఆంధ్రా కబడ్డీ చాంపియన్‌షిప్ జట్ల ఎంపికకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన లభించింది. గుంటుపల్లి సీఏ కన్వెన్షన్‌లో జరిగిన పోటీల్లో 500 మందికి పైగా ఔత్సాహిక కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు. చెన్నైకి చెందిన ఇఎల్ఇవి-8 ఇండియా స్పోర్ట్స్‌తో కలిసి ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషుల యువ ఆంధ్ర కబడ్డీ చాంపియన్‌షిప్ అగస్టు 15 నుంచి 25 వరకు జరగనుంది. టోర్నమెంట్ వేదిక త్వరలో ఖరారు కానుంది. వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.అర్జున్ రావు, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ పర్యవేక్షించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ఒక్కొక్క జట్టుకు 17 మంది ఆటగాళ్లతో పాటు ఐదు మంది స్టాండ్‌బైగా ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నారు. ఇఎల్ఇవి-8 ఇండియా స్పోర్ట్స్ ప్రతి మ్యాచ్‌కు రూ.14వేలు, గెలిచిన జట్టు, ఓడిన జట్టుకు వ్యక్తిగత అవార్డులు ఇస్తామన్నారు. అసోసియేషన్ కోశాధికారి ఎం.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో భూమి కేటాయించండి

● మంత్రి నారాయణకు ప్రెస్‌క్లబ్ ప్రతినిధుల వినతి



విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో ప్రెస్‌క్లబ్ కోసం భూకేటాయింపులు చేయాలని ప్రెస్‌క్లబ్ అమరావతి ప్రతినిధులు మంత్రి నారాయణను కోరారు. సచివాలయంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణను శుక్రవారం ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. దేశంలోనే అత్యున్నత స్థాయిలో ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి సహకరించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

# కష్టాల్లో నర్సింగ్ కళాశాల

● సొంత స్థలం లేదు..భవనాలు లేవు ● చాలీచాలని గదుల్లో విద్యార్థినుల ఇబ్బందులు ● లాకర్లు లేవు ● మరుగుదొడ్లకూ అసౌకర్యమే

వైద్యరంగంలో స్థిరపడి సమాజానికి తమవంతు సేవ చేయాలనుకున్న వారికి ఆదిలోనే కష్టాలు ఎదురవుతున్నాయి. విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి అనుబంధంగా నిర్వహిస్తున్న బీఎస్సీ నర్సింగ్ కళాశాలకు శాశ్వత భవనం లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలేజీకి అనుమతులు వచ్చి ఐదేళ్లు అవుతున్నా ఇంత వరకు సొంత భవనాలు లేవు. డిప్లొమో నర్సింగ్ స్కూలుకు కేటాయించిన భవనంలోనే కళాశాల విద్యార్థినులకు తరగతులు నిర్వహిస్తున్నారు. గదులు చాలక, బాత్రూమ్‌లు సైతం తగినన్ని లేక అనేక ఇక్కట్లకు గురవుతున్నారు.




(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

నర్సింగ్ కళాశాల సిద్దార్థ మెడికల్ కాలేజీకి అనుసంధానంగా ఉన్నప్పటికీ పాలనా వ్యవహారాలన్నీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలోనే జరుగుతుంటాయి. వంద సీట్లతో ఐదు సంవత్సరాల కిందట నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేశారు. కళాశాలకు భవనాలు లేకపోగా ఇప్పటి వరకు కనీసం స్థలాన్ని కేటాయించకపోవడం గమనార్హం. వైసీపీ హయాంలో కాలేజీని మంజూరు చేసినప్పటికీ తరువాత కాలంలో నాయకులు గాలికొదిలేశారు. సిబ్బందికంటూ ప్రత్యేక గది కూడా లేదు. కాలేజీకి సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా నర్సింగ్ స్కూలు యాజమాన్యం ప్రిన్సిపాల్‌కు కేటాయించిన చిన్న గదిలోనే సమావేశాలు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి. కళాశాల విద్యార్థినులకు స్కూలులోని కొన్ని గదులు కేటాయించినప్పటికీ, సరిపోకపోవడంతో స్కూల్లో ఉన్న రెండు హాళ్లలో సర్దుకుపోతున్నారు.

### నేలపైనే బెడ్లు, తలదగ్గరే లగేజీ

డిప్లమో నర్సింగ్ స్కూలుకు విద్యా సంవత్సరానికి 30 సీట్లు మా త్రమే కేటాయించారు. ప్రస్తుతం 80 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. స్కూలులో రెండు అంతస్తుల్లో 32 గదులు ఉన్నాయి. కాలేజీ రాకముందు వరకు వాటిని స్కూ లు విద్యార్థినులే ఉపయోగించుకోవడం వల్ల ఎలాంటి సమస్య లేకపోయింది.

నర్సింగ్ కళాశాల విద్యార్థులకు నాలుగు సంవత్సరాల కోర్సులో ఏడాదికి వందసీట్లు కేటాయించడంతో ప్రస్తుతం 380 మంది ఉన్నారు. వీరిలో 56 మంది డే స్కాలర్‌లు ఉండగా, ప్రస్తుతం 320 మంది హాస్టల్‌లో ఉంటున్నారు. మొదటి అంతస్తులో ఉన్న 16 గదులను కాలేజీ విద్యార్థినులకు కేటాయిచారు. ఒక్కో గదికి ఆరు నుంచి ఎనిమిది మంది విద్యార్థునులకు కేటాయించినప్పటికీ గదులు సరిపోకపోవడంతో అదే భవనంలో ఉన్న రెండు హాళ్లను ఉపయోగించుకుంటున్నారు. ఈ హాళ్లలో ఉంటున్న వారికి మంచాలు లేకపోవడంతో నేలపైనే పరుపులు వేసుకుని నిద్రపోతున్నారు. వస్తువులు దాచుకోడానికి కనీసం లాకర్లు కూడా లేవు. తలదగ్గరే లగేజీ పెట్టుకోవడంతో స్థలం చాకపోవడంతో పాటు విలువైన వస్తువులకు భద్రత లేకుండా పోయింది.

### నాలుగు చోట్ల తరగతులు

నాలుగు సంవత్సరాల విద్యార్థినులకు నాలుగు చోట్ల తరగతులు నిర్వహిస్తున్నారు. జీజీహెచ్‌లోని పుష్కర్ హాల్‌లో మొదటి ఏడాది విద్యార్థులకు, హాస్టల్ వెనుకభాగంలో ఉన్న రేకులషెడ్డులో ద్వితీయ సంవత్సరం, ఫిజియో విభాగంలో మూడో ఏడాది, స్కూలు భవనంలో ఓ గదిలో నాలుగో ఏడాది విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు భోజనం చేయాలంటే మాత్రం రెండో ఏడాది తరగతులు నిర్వహిస్తున్న చోటే బ్యాగులు పక్కన పెట్టి భోజనం తినాల్సిన దుస్థితి. సరైన వసతి, తరగతి గదులు, భోజనం, కనీస అవసరాలు ఇలా అన్ని విధాలా ఇబ్బందులు పడుతూ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని వీలైనంత తొందరగా సొంత భవనాలను సమకూర్చి తమ కష్టాలకు చెక్ పెట్టాలని నర్సింగ్ కళాశాల విద్యార్థినులు కోరుతున్నారు.

### మరుగుదొడ్లకూ ఇబ్బందే

సూపరిండెంటెండ్ చొరవతో కాలేజీకి స్కూలు భవనంలో గదులు కేటాయించినప్పటికీ విద్యార్థినులకు సరిపడా బాత్రూంలు లేకపోడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఎంత తొందరగా మేల్కొన్నప్పటికీ ఎక్కువ మంది విద్యార్థినులు బాత్రూం సమస్య కారణంగా తరగతులకు సమయానికి చేరుకోలేకపోతున్నారు.

# కేంద్రాన్ని ఒప్పించి నిధులు తేవాలి

● ఆర్టీసీ స్థలాన్ని లులు కంపెనీకి కట్టబెట్టడం సమంజసం కాదు
● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు




ఎన్టీఆర్ జిల్లా సీపీఎం విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అభివృద్ధికి సింగపూర్ ప్రభుత్వాన్ని ఒప్పిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు విమర్శించారు. బాలోత్సవభవన్‌లో శుక్రవారం జరిగిన భారత కమ్యూనిస్టుపార్టీ(మార్క్సిస్ట్) ఎన్టీఆర్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా సీపీఎం అగ్రనేత అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబూరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో రాష్ట్రాన్ని, జిల్లా అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కేంద్రాన్ని ఒప్పించి, ఒత్తిడి చేసి అమరావతి, రాష్ట్ర అభివృద్ధికి నిధులు తేవాలని డిమాండ్ చేశారు. విభజన చట్ట ప్రకారం అమరావతి నిర్మాణానికి నిధులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. సీఆర్డీఏ ప్రాంతపరిధిలో జరుగుతున్న హడావుడి అంతా బడా కంపెనీల అభివృద్ధి తప్ప, ఈ ప్రాంత ప్రజలను పూర్తిగా ప్రభుత్వం వదిలేసిందని బాబూరావు దుయ్యబట్టారు. మెట్రోప్రాజెక్టుకు గ్లోబల్ టెండర్ల ఆహ్వానం ఏమో కానీ, గోతుల మయంగా ఉన్న రోడ్లను బాగుచేసే నాథుడు లేకుండా పోయారన్నారు. మెట్రో కోసం ప్రైవేటువ్యక్తుల దగ్గర భూములు తీసుకుంటూ, మరోవైపు ఆర్టీసీ పాత బస్టాండ్‌కు సంబంధించిన రూ.400 కోట్లు విలువ చేసే ఐదెకరాల స్థలాన్ని లులు కంపెనీకి ధారాదత్తం చేయడాన్ని విమర్శించారు. ఇప్పటికే సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్యతరగతి వ్యాపారులను దెబ్బతీసే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. బుడమేరు ముంపు నివారణా చర్యలు ప్రకటనలకే పరిమితం అయ్యాయన్నారు. బడా కంపెనీలకు వేగంగా స్థలాలు కేటాయిస్తున్న ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ఒక్క సెంటు కూడా సేకరించకపోవడం దారుణమన్నారు. ఎస్ఆర్ఆర్, శాతవాహన కాలేజీ భూములను కబ్జా చేస్తున్నా పాలకులు నోరు మెదపడం లేదన్నారు. కూటమి ప్రజాప్రతినిధులు ఇసుక, గ్రావెల్, బూడిద, బెల్ట్‌షాపులు, కాంట్రాక్టులు ఇలా అన్నింటా అవినీతిలో వైసీపీతో పోటీపడుతున్నారని విమర్శించారు. స్మార్ట్‌మీటర్లు బలవంతంగా బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. సీపీఎం నాయకుడు వై.వెంకటేశ్వరరావు, డి.కాశీనాథ్, జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాజధాని ప్రాంత రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నోడల్ అధికారి జయశ్రీ

## వార్షిక కౌలు సమస్య పరిష్కారానికి కృషి

కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వార్షిక కౌలు జమకాని రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని గ్రీవెన్స్ రిడ్రసల్ మేనేజ్‌మెంట్ (జీఆర్ఎం) నోడల్ అధికారి పి.జయశ్రీ తెలిపారు. ఆధార్ బేస్డ్ క్రెడిట్ విధానంలో వార్షిక కౌలు నగదు సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. సాంకేతిక సమస్యల కారణంగా కౌలు నగదు జమ కానట్లయితే రానున్న 15 రోజుల్లో జమయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. 11వ ఏడాది వార్షిక కౌలుకు సంబంధించిన సమస్యలపై రాజధాని ప్రాంతవాసులు అర్జీలను అందజేశారు. పలు ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని, అలసత్వం వద్దని నోడల్ అధికారి జయశ్రీ సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. గ్రీవెన్స్ డేలో 54 ఫిర్యాదులు వచ్చాయన్నారు. గ్రీవెన్స్ డేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, పి.పద్మావతి, జి.రవీందర్, జి.భీమారావు, ఏజీ చిన్నికృష్ణ, సీఆర్‌డీఏ సర్వే విభాగ అసిస్టెంట్ డైరక్టర్ జి.పాండురంగారావు, రామకృష్ణన్, సామాజిక సంక్షేమ విభాగ డీసీడీవో బి.శ్రీనివాసరావు, జాయింట్ డైరక్టర్ సిహెచ్.మధుసూదనరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు కురిసే అవకాశం

# అధికారులు అందుబాటులో ఉండాలి : కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వచ్చే మూడురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో సమన్వయం చేసుకొంటూ మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులు అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, ఇళ్లలోకి నీళ్లు వచ్చే పరిస్థితి లేకుండా చూడాలని సూచించారు. అవసరం మేరకు తక్షణం స్పందించేందుకు వీలుగా ఇప్పటికే రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందం నగరంలో అందుబాటులో వున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసే 91549 70454 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ స్థాయిలోనూ ప్రత్యేకంగా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి నిరంతరం పరిస్థితిని సమీక్షించాలన్నారు. ఎక్కడైనా చెట్లు పడిపోతే వెంటనే తొలగించేలా క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, నిత్యావసర సరుకులు పంపిణీపై ప్రధానంగా దృష్టి సారించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

### సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉన్నామని, నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 0866-2574454 నెంబరుతో 24 గంటలూ పనిచేసేలా విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. డివిజన్‌లో వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఈ ఫోన్ నెంబర్‌కి కాల్ చేసి సమాచారం అందించాలని ఆర్డీఓ చైతన్య కోరారు.

# అశోక్ లేల్యాండ్ 100 బస్సులు పూర్తి

● జంక్షన్ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు




హనుమాన్‌జంక్షన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి ఏపీఐఐసీ అశోక్ లేల్యాండ్ బస్ బాడీ బిల్డింగ్ యూనిట్ సిబ్బంది శుక్రవారం స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. ఫ్యాక్టరీలో వంద బస్సులు నిర్మాణం పూర్తయిన సందర్భంగా యూనిట్ సిబ్బంది, కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. అశోక్ లేల్యాండ్ ఏపీ యూనిట్ ఇన్‌చార్జి శ్రీధరన్ ఆధ్వర్యంలో సిబ్బంది అభయాంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు జరిపి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు మినీ బస్సుకు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో అశో క్ లేల్యాండ్ బస్సు బాడీ యూనిట్‌కు 2017లో రాష్ట్ర ప్రభుత్వం 75 ఎకరాలు కేటాయించింది. 2018 మార్చి 31న అప్పటి నారా చంద్రబాబునాయుడు ఫ్యాక్టరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. 2018లోనే ఆరు నెలల్లో బస్సు నిర్మించి ఇస్తామని అశోక్ లేల్యాండ్ హామీ ఇచ్చింది. ఈలోగా ప్రభుత్వం మారడంతో యూనిట్ మూతపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా ఈ ఏడాది మార్చి 19న మంత్రి నారా లోకేశ్ తిరిగి యూనిట్‌ను ప్రారంభించారు. నాలుగు నెలల్లో 101 బస్సులు నిర్మాణం పూర్తి చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వ ఇండెంట్ ప్రకారం ఫ్యాక్టరీలో బస్సులు తయారు చేస్తున్నారు. ఫ్యాక్టరీ పున: ప్రారంభం కావడంతో దాదాపు 800 మంది

## ఇగ్నో వైస్ చాన్స్‌లర్‌గా ఉమా కాంజిలాల్

వన్‌టౌన్ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ ఉమా కాంజిలాల్‌ను నియమిస్తూ కేంద్ర విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిందని విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఇగ్నో నడుస్తుందని, కాంజిలాల్ ఐదు సంవత్సరాలు పనిచేయనున్నట్టు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. గత సంవత్సరకాలంగా ఇగ్నోకు కాంజిలాల్ తాత్కాలిక వైస్ చాన్సలర్‌గా పనిచేస్తున్నారన్నారు. ఇగ్నోను ప్రగతిపథంలో నడిపించేందుకు, విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించేందుకు ఆమె కృషి చేయనున్నట్టు తెలిపారు.

## ఏపీలో 11,862 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు

వన్‌టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు దేశ వ్యాప్తంగా 1,78,154 పనిచేస్తున్నాయని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జా దవ్ లిఖితపూర్వకంగా వివరించారు. ఎంపీ కేశినేని శివనాథ్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు అయన స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో 11,862 ఆయుష్మాన్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. వాటి నిర్వహణకు మూడు ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ.157కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో మెరుగైన ఆరోగ్య సదుపాయాలను కల్పించాలన్న లక్ష్యంతో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించామని, సామాన్యులకు ప్రాథమిక వైద్యశాలలు అందుబాటులో ఉంటున్నాయని చెప్పారు.

# ప్రేక్షకుల మదిలో కోటకు సుస్థిర స్థానం

● సంతాప సభలో వక్తల నివాళి




సంతాప సభలో కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తదితరులు

గాంధీనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విలక్షణమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కోట శ్రీనివాసరావు మృతి చిత్ర పరిశ్రమకు తీరనిలోటని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ నటుడు, మాజీ ఎమ్మెల్యే పద్మశ్రీ కోటా శ్రీనివాసరావు సంతాప సభ గాంధీనగర్‌లోని ప్రముఖ హోటల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. పలువురు ప్రముఖులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ శ్రీనివాసరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ నాటక రంగం నుంచి సినీ రంగంలో ప్రవేశించి సుమా రు 750 సినీమాల్లో వైవిధ్యభరిత పాత్రలతో తెలుగు, తమిళం, కన్నడం తదితర భాషల్లో ప్రేక్షకులను అలరించారన్నారు. పట్టణ ప్రాంతా ల్లో ఇళ్లు లేని నిరుపేదలకు కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకానికి కోటా శ్రీనివాస రావు అద్యుడన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను మాట్లాడుతూ 1999 నుంచి 2003 వరకు ఎమ్మెల్యేగా విజయవాడ నగరాభివృద్ధికి కోటా శ్రీనివాసరావు ఎంతో కృషి చేశారన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరా మ్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో మాజీ ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస రావు, దారా సాం బయ్య, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

### బాబూమోహన్ కన్నీటి పర్యంతం

ప్రముఖహాస్య నటుడు బాబూమోహన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంతాపసభలో పాల్గొని కోటాతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తామిద్దరం సొంత అన్నదమ్ములుగా మెలిగామన్నారు. ఒకేరోజు ఆరు సినిమాల షూటింగ్‌లలో పాల్గొనేవాళ్లమని చెప్పా రు. అర్థం చేసుకునే వాళ్లకు ఆయన చాలా మంచి వాడని, నిర్మొహమాటంగా మాట్లాడం అయన నైజమన్నారు. ఆయన మరణం తీవ్ర బాధను కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 232 |
| చికెన్ స్కిన్‌లెస్ | 242 |
| నెక్ కోడిగుడ్డు ధర (100) | |

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

## గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**గుడివాడ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి):** మోటూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి శుక్రవారం సూచించారు. ప్రవేశ పరీక్ష రాసిన, రాయని విద్యార్థులు పాఠశాలలో దరఖాస్తు చేసుకుంటే ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు.



పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కొసరాజు ప్రకాష్

## చినముత్తేవి పీఏసీఎస్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

**కూచిపూడి, జూలై 25(ఆంధ్రజ్యోతి):** చినముత్తేవి పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శుక్రవారం కార్యాలయంలో నిర్వహించారు. చైర్మన్‌గా కొసరాజు ప్రకాష్ మాధుర్, సభ్యులుగా మురారి శివనాగరాజు, సుంకర వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, సర్పంచ్ కొమ్ము సౌదామణి, ఎంపీటీసీ సభ్యురాలు గారపాటి భాగ్యలక్ష్మి, నేతలు వీరంకి తులసీదాస్, భోగాది నాగేశ్వరరావు, పోతుల శ్రీనివాసరావు(అడ్వకేట్), పోతుల నాగేంద్రం, జోగి సాయి ప్రసాద్, కొండవీటి సుధాకర్, సూపర్‌వైజర్ శర్మ, కార్యదర్శి లీలాకృష్ణ పాల్గొన్నారు.

### నిధుల అవకతవకలపై విచారణ జరిపించాలి

గత పాలకవర్గ హయాంలో పీఏసీఎస్‌లో సుమారు రూ.70 లక్షల మేర నిధులు అవకతవకలు జరిగినట్లు ఉన్నతాధికారుల విచారణలో తేటతెల్లమైందని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నిధుల రికవరీకి అధికారులు చర్యలు తీసుకోవాలని నూతన పాలకవర్గంతోపాటు రైతులు, గ్రామస్థులు కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎరువులను అందుబాటులో ఉంచాలని, రైతులకు రుణాలు సకాలంలో అందేలా చూడాలని నూతన పాలకవర్గం తీర్మానించింది.

## తహసీల్దార్ కార్యాలయానికి ఇన్వర్టర్ అందజేత

**గుడివాడ రూరల్:** దాతలు ప్రభుత్వ కార్యాలయాలకు వితరణ ఇవ్వటం అభినందనీయమని పెదపారుపూడి తహసీల్దార్ శ్రీనునాయక్ అన్నారు. లింగవరానికి చెందిన మలిరెడ్డి ఆజాబాబు పెదపారుపూడి తహసీల్దార్ కార్యాలయానికి ఇన్వర్టర్‌అందజేశారు. మలిరెడ్డి పద్మావతి జ్ఞాపకార్థం ఉచితంగా అందజేశారు.



గుడివాడలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



జువ్వనపూడిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

# అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ పిచ్చివాగుడు

● తొలి అడుగులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**గుడివాడ/గుడివాడ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు పిచ్చివాగుడు వాగుతున్నారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం 18వ వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, నాయకులు రాంబాబు, సత్యనారాయణ, సాంబశివరావు, గోకవరపు సునీల్, జగన్మోహనరావు, ఉమా, కంచర్ల సుధాకర్, నెరుసు కాశీ, ఇమ్మానియేలు, వీరభద్రరావు, లోయ విజయ్ పాల్గొన్నారు. చిన ఎరుకపాడులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి, వైస్ చైర్మన్ గోరిపర్తి సుబ్బారావు, నాయకులు ఎం.విజయేంద్రబాబు, ఎం.కనకదుర్గయ్య, ఎస్.సూరిబాబు, గోవర్ధన్, గుడిబాబు, నరసింహారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు, కైలే కాళిదాసు, గంజి సాంబశివరావు, మత్తే వెంకటేశ్వరరావు, కొండవీటి ఫణీంద్ర, కైలే రంజిత్ కుమార్, గౌతమ్ రాయి, జువ్వనపూడి దుర్గారావు, కాటూరి ప్రసన్న, వేమవరపు దేవా పాల్గొన్నారు.

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**పామర్రు:** అర్హులందరికీ సంక్షేమ పథకాలందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నేతలు అన్నారు. 19వార్డులో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నాయకులు నిర్వహించారు. మంతెన రామాంజనేయులు, పరిసే సుబ్రహ్మణ్యం, వీరంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### జువ్వనపూడిలో..

**పెదపారుపూడి:** జువ్వనపూడి గ్రామంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు నేలపాల శివరాజు, కాటమరాజు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాగోలు వెంకట రాజు, పాగోలు కాటమరాజు, చిలకా ధనరాజు, పాగోలు కిరణ్, పాగోలు సురేష్ పాల్గొన్నారు.



కూచిపూడిలో బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయంలో పూజలు

## దేవాలయాల్లో శ్రావణ శోభ

**కూచిపూడి, జూలై 25(ఆంధ్రజ్యోతి):** శ్రావణ మాసం మొదలు కావటంతో శుక్రవారం గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. శ్రావణ శుద్ధ పాడ్యమి శుక్రవారం(తొలి రోజు) దేవాలయాలు మహిళలతో కళకళలాడాయి. కూచిపూడి గంగాబాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు శ్రావణలక్ష్మిగా దర్శనమిచ్చారు. పెదపూడి, మొవ్వ, గూడపాడు, మొవ్వపాలెం, కోసూరు, కాజ, నిడుమోలు, చినముత్తేవి, అయ్యంకి శివాలయాల్లో అమ్మవారికి విశేష పూజలు జరిపారు.

### కొండాలమ్మకు ప్రత్యేక పూజలు

**గుడ్లవల్లేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి):** శ్రావణ మాసం తొలిరోజు తొలి శుక్రవారం కావడంతో వేమవరం కొండాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర కుంకమార్చన, అమ్మవారికి పంచామృత అభిషేకం చేసి, సాయంత్రం పంచహారతి ఇచ్చారు. ఆలయ అలివేటి మండపంలో ఉత్సవమూర్తికి నిర్వహించిన ప్రత్యేక పూజాకార్యక్రమాలలో ఆలయ ఈవో ఎ.కొండలరావు దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు శివసంతోష్ శర్మ నిర్వహించారు.



## విఘ్నేశ్వరస్వామి దేవస్థానానికి విరాళాలు

**గుడివాడ, జూలై 25(ఆంధ్రజ్యోతి):** మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వర స్వామి దేవస్థానంపై భాగాన ఏర్పాటు చేస్తున్న దేవతామూర్తుల విగ్రహాలను చెక్కించడానికి పట్టణానికి చెందిన వక్తరామ్, శాంతాదేవి దంపతులు రూ.10,116, భంగా రామ్ దీవాదేవి దంపతులు రూ.10,116 విరాళమిచ్చారు. శుక్రవారం ఆలయ ఈవో వైశ్రీనివాసరావు(వాసు)కు నగదు అందించారు.



అయ్యంకి - పెడసనగల్లు రహదారి



కపిలేశ్వరపురంలో రోడ్డు

# చెరువుల్లా దారులు

● అవస్థలు పడుతున్న ప్రజలు

**(ఆంధ్రజ్యోతి-కూచిపూడి):** విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మొవ్వ, కూచిపూడి బస్టాండ్ ప్రాంతాలు, పెదపూడి, బార్లపూడి ప్రధాన రహదారులు జలమయంగా మారాయి. అయ్యంకి నుంచి పెడసనగల్లు వెళ్లే రహదారి, మొవ్వ కళాశాల రహదారి చిత్తడిగా మారటంతో వాహనదారులు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐనంపూడి, భీమనది డ్రైన్లు పొంగి పొర్లుతున్నాయి. డ్రెయిన్లలో గుర్రపు డెక్క అల్లుకుపోవటంతో వర్షపు నీరు కిందకు వెళ్లక పొలాలు ముంపునకు గురయ్యాయి.

**(ఆంధ్రజ్యోతి-పమిడిముక్కల):** వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి రోడ్లు చెరువుల్లా మారాయి. కపిలేశ్వరపురం నడిబొడ్డున ఆర్ అండ్ బీ రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపునీటితో స్థానికులు, రోడ్డుపై వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. స్థానికులు గుంతల్లో నిలిచిన నీరు పోయేలా గాడులు తీశారు. రోడ్డు బాగుచేయించాలని కోరుతున్నారు.



నివాళులర్పిస్తున్న కాపు సేవా సమితి సభ్యులు

## ఘనంగా కైకాల జయంతి

**గుడివాడ, జూలై 25(ఆంధ్రజ్యోతి):** పట్టణ కాపు సేవాసమితి ఆధ్వర్యంలో నటుడు కైకాల సత్యనారాయణ 90వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కైకాల విగ్రహానికి నివాళులర్పించారు. గుడివాడ ముద్దుబిడ్డ కైకాల భౌతికంగా లేకపోయినా, ఆయన నటించిన చిత్రాల రూపంలో చేసిన మంచి పనుల ద్వారా తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణ అన్నారు. అధ్యక్షుడు నరహరిశెట్టి ప్రసాద్, కార్యదర్శి మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షులు సుంకర గాంధీ, బండారు నోబుల్ నాయుడు, పంచకర్ల వెంకట్, పందిళ్ల నాగమల్లేశ్వరరావు, సాయన గాంధీ, వెంపల అప్పారావు, కళాకారుల సమైక్య ఉపాధ్యక్షుడు లోయ రాధాకృష్ణ పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు

## పశువులకు వైద్యపరీక్షలు

**గుడివాడ, జూలై 25(ఆంధ్రజ్యోతి):** రావి వీరభద్రయ్య బహుళార్థ పశు వైద్యశాలలో శుక్రవారం నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల పశువైద్యశిబిరం నిర్వహించారు. ఎదకు రాని, తిరగపోర్లే 26 పశువులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందజేశారు. సహాయ సంచాలకుడు డాక్టర్ పి.శ్రీనివాసరావు, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, హరికృష్ణ, డాక్టర్ పి.రత్నశ్రీ వైద్యసేవలందించారు.

### నేడు మెగా వైద్యశిబిరం

**గుడివాడ, జూలై 25(ఆంధ్రజ్యోతి):** నీలామహల్ రోడ్డులోని కనకదుర్గమ్మ దేవస్థానం ఆవరణలో శనివారం స్టేడియం వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఒమేగా, అను హాస్పిటల్స్ వైద్య బృందం వైద్యసేవలందిస్తారని, గుడివాడ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

### మహిళపై బస్సు డ్రైవర్ దాడి

గుడివాడ, జూలై 25(ఆంధ్రజ్యోతి): మహిళపై ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ దాడి చేసిన ఘటన గురువారం జరిగింది. శుక్రవారం ఈ ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతవోలుకు చెందిన మహిళ, ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ సుబ్రహ్మణ్యస్వామితో కొన్నాళ్లుగా సహజీవనం చేస్తోంది. ఇటీవల వివాహం చేసుకోవాలని ఆమె అడుగుతోంది. గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి, మహిళ మధ్య స్వల్ప వివాదం జరిగింది. మహిళను స్వామి తలపై కొట్టడంతో గాయమైంది. చికిత్స నిమిత్తం ఆమెను ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహిళ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై వి.జాస్మిన్ తెలిపారు

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడండి

పామర్రు మండల సమావేశంలో ఎంపీపీ అశోక్‌కుమార్

**పామర్రు, జూలై 25(ఆంధ్రజ్యోతి):** వర్షాల కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులకు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ సూచించారు. ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడానికి అంచనాలు రూపొందించాలని సూచించారు. పసుమర్రు సర్పంచ్ కాకి నాగేంద్రం, బల్లిపర్రు సర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్‌లు తమ గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని కోరారు. ఎంపీడీవో కె.జ్యోతి, పంచాయతీరాజ్ ఏఈ పి.రామారావు, వ్యవసాయశాఖ ఏవో వి.శివనాగరాణి, ఎంఈవో శ్రీనివాసరావు, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వైస్ ఎంపీపీ రమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో గుత్తికొండ కిషోర్ పాల్గొన్నారు.



## పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలి

**గుడివాడ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి):** పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చూడాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ సూచించారు. శుక్రవారం లింగవరం గ్రామంలో చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. వర్షం ఉన్నప్పటికీ గ్రామ పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరిస్తున్నారని అన్నారు.




## రసాయన ఎరువుల వాడకం తగ్గించండి

వ్యవసాయ సహాయ సంచాలకురాలు జ్యోతిరమణి



కురుమద్దాలిలో రైతులకు సూచనలందిస్తున్న జ్యోతిరమణి

**పామర్రు, జూలై 25(ఆంధ్రజ్యోతి):** ఖరీఫ్ సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలని రైతులకు జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ సహాయ సంచాలకురాలు కె.జ్యోతిరమణి సూచించారు. కురుమద్దాలిలో శుక్రవారం వ్యవసాయశాఖ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో రైతులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. వరిలో యాజమాన్యం, కలుపునివారణ పద్ధతులను వివరించారు. ఏవో వి.శివనాగరాణి, డీఆర్సీఏవో బి.పద్మజ, వీఏఏ పావని పాల్గొన్నారు.

## వైసీపీ బలోపేతానికి పనిచేద్దాం : కైలే

**పామర్రు, జూలై 25(ఆంధ్రజ్యోతి):** వైసీపీని బలోపేతం చేసేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. బీఎస్‌రెడ్డి కల్యాణ మందిరంలో శుక్రవారం మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ అక్రమ కేసులకు ఎవ్వరూ భయపడొద్దని, పార్టీ అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు.

## దమ్ము ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

**గుడ్లవల్లేరు, జూలై 25(ఆంధ్రజ్యోతి):** విన్నకోట గ్రామంలో దమ్ము ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..విన్నకోట గ్రామానికి చెందిన డ్రైవర్ ఇంటూరి ఏసోబు అలియాస్ నాగేశ్వరరావు(46) తను పని చేస్తున్న ట్రాక్టర్‌పై పొలం దమ్ము చేసి, పని ముగించి గట్టు ఎక్కుతుంటే ట్రాక్టర్ బోల్తా పడింది. ఏసోబు దాని కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై జి.వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : డీఎస్పీ

**గుడివాడ, జూలై 25(ఆంధ్రజ్యోతి):** ద్విచక్రవాహనదారులు ట్రాఫిక్ నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ సూచించారు. శుక్రవారం ఏజీకే సెంటర్‌లో ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనాలకు నెంబరు ప్లేటు, ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అని తెలిపారు. వాహనం నడిపే వ్యక్తి లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి జరిమానాలు విధించారు. టూటౌన్ సీఐ జె.ఆర్.కె హనీష్, ఎస్సై వి.జాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

## చినఓగిరాల సొసైటీ చైర్‌పర్సన్‌గా
# పాలడుగు ప్రమాణస్వీకారం

**ఉయ్యూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :** చినఓగిరాల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం (పీఏసీఎస్) పాలకవర్గ సభ్యులు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. సంఘం చైర్‌పర్సన్‌గా గ్రామ మాజీ సర్పంచ్ సీనియర్ టీడీపీ నాయకుడు పాలడుగు రామకృష్ణ, డైరెక్టర్లుగా మొగదాటి స్టాన్లీ జోన్స్ బాబు, కనకదుర్గారావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాలడుగు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు సక్రమంగా అందేలా పనిచేసి ప్రభుత్వానికి, పార్టీకి మంచి పేరు తీసుకు వస్తామని, రైతులకు మెరుగైన సేవలందించి మన్ననలు పొందుతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కె.ప్రవీణ్, పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, సర్పంచ్ యెనిగళ్ల శిరీష, మాజీ సర్పంచ్ నాగభూషణం, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 232 |
| చికెన్ స్కిన్‌లెస్ | 242 |

**నెక్ కోడిగుడ్డు ధర (100)**
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

కేయూ రీ వాల్యుయేషన్ ఫలితాల్లో

## 817 మంది ఉత్తీర్ణత

మచిలీపట్నం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో 2020-25 విద్యా సంవత్సరంలో యూజీ 2, 4వ సంవత్సరం సెమిస్టర్ పరీక్షల రీ వాల్యుయేషన్ ఫలితాలను శుక్రవారం యూనివర్సిటీ ఉపకులపతి కూన రాంజీ వెల్లడించారు. 3952 మంది విద్యార్థులు పునఃమూల్యాంకనానికి దరఖాస్తు చేసుకుంటే, 817 మంది ఉత్తీర్ణులయ్యారని ఆయన తెలిపారు. పరీక్షల నియంత్రణ అధికారి వీరబ్రహ్మాచారి, రిజిస్ట్రార్ ఎన్.ఉష, డీన్ బసవేశ్వరరావు పాల్గొన్నారు.

## వీధుల్లో తిరిగే పశువులను మార్కెట్‌యార్డు షెడ్లలోకి తరలించండి

● అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశం

మచిలీపట్నం టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో వీధుల్లో తిరుగుతున్న పశువులను మార్కెట్ యార్డు వెనుక ఉన్న షెడ్లలోకి తరలించాలని అధికారులను మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. తక్షణమే షెడ్లకు మరమ్మతులు చేయించి వారం రోజుల్లోగా ఈ ప్రక్రియ ప్రారంభించాలని ఆయన సూచించారు. శుక్రవారం మార్కెట్ యార్డును ఆయన సందర్శించి అధికారులతో సమీక్షించారు. మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, టీడీపీ నాయకులు హసీంబేగ్, కోస్తా మురళీకృష్ణ, డీఎస్పీ రాజా, మార్కెటింగ్ ఏడీ నిత్యానందరావు, యార్డు కార్యదర్శి భాస్కరరావు, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, ట్రాఫిక్, పశుసంవర్ధక శాఖ, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

### పీ-4 భాగస్వామి మురారి సాత్విక్‌కు అభినందన

పీ-4 కార్యక్రమంలో భాగస్వామి, చల్లపల్లికి చెందిన యువ పారిశ్రామికవేత్త మురారి సాత్విక్ శుక్రవారం మంత్రి కొల్లు రవీంద్రను మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో పీ-4 కార్యక్రమంలో భాగస్వామి అయ్యి నలుగురు పేద విద్యార్థులకు విదేశీ విద్యా అవకాశం కల్పించి స్కాలర్‌షిప్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నందుకు సాత్విక్‌ను మంత్రి అభినందించారు.



మురారి సాత్విక్‌ను సన్మానిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ల అందజేత

అనారోగ్యంతో బాధపడుతున్న 40వ డివిజన్‌కు చెందిన జొన్నలగడ్డ సూర్యనారాయణ చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధిని నుంచి రూ.3లక్షల చెక్కును మంత్రి కొల్లు రవీంద్ర అందజేశారు. రొండికృష్ణ యాదవ్, కోస్తా మురళీకృష్ణ, నాలి మాధవ పాల్గొన్నారు. రుద్రవరం పంచాయతీ పరిధిలో కృష్ణారావు పేటలో నివసిస్తున్న తరకటూరు రవి కుటుంబానికి రూ.64వేల సీఎం సహాయనిధి చెక్కును టీడీపీ నాయకుడు నీలం రమేష్ అందజేశారు. జనసేన నాయకుడు ఎడ్లవల్లి గణేష్, పులిపర్తి పాపారావు పాల్గొన్నారు. 26వ డివిజన్‌కు చెందిన ఎన్నేటి శ్రీనివాసరావుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.55,546 చెక్కును జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు అందజేశారు. టీడీపీ నాయకులు చెరుకూరి సూరిబాబు, షేక్ మౌలాలి, అజీం, వన్నంరెడ్డి ప్రసాద్, షేక్‌బాషా, హసీంబాషా, షేక్ నాగూర్‌బాబు పాల్గొన్నారు.



సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

## మోపిదేవిని మరింత అభివృద్ధి చేస్తాం

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఎదుట ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు గ్రామానికి మరో రోడ్డు నిర్మిస్తాం. భక్తుల కోసం టాయిలెట్ కాంప్లెక్స్, వసతి గదులు నిర్మిస్తాం. కోనేరు ఆవరణలో నిర్మిస్తున్న వసతి గదుల సహిత షాపింగ్ కాంప్లెక్స్‌ను త్వరలో ప్రారంభిస్తాం.' అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉపాధి నిధులు రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. మోపిదేవిలో రూ.79 లక్షలతో పది సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. మండలంలో రూ.4.97 కోట్లతో 81 సీసీ రోడ్లు, నియోజకవర్గంలో రూ.32.24 కోట్లతో 46 కిలోమీటర్ల మేర 523 సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. మండలి వెంకట్రామ్, సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, దొప్పలపూడి గంగా భవాని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, నేతలు నడకుదుటి జనార్దనరావు, పూషడపు రత్నగోపాల్, ఎంపీడీవో స్వర్ణభారతి, పంచాయతీరాజ్ శాఖ డీఈఈ సురేష్ బాబు, ఏఈఈ శ్రీనివాసరావు, ఎంఈవో గోపాల్, పంచాయతీ ఈవో ఎం.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## రోడ్డుపై గోతులు పూడ్చిన టీడీపీ నేతలు

అవనిగడ్డ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ- నాగాయలంక ప్రధాన రహదారిపై డంపింగ్ యార్డు వద్ద ఇటీవల పలు ప్రమాదాలకు కారణంగా మారిన గోతులను శుక్రవారం టీడీపీ నేతలు స్వచ్ఛందంగా పూడ్చించారు. డంపింగ్ యార్డు సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు మిత్ర బృందం రహదారిపై పడిన గోతుల్లో కాంక్రీట్ వేసి మరమ్మతులు చేయించారు. డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ, అడపా వెంకటేశ్వరరావు, యలవర్తి చిన్నా, మొగల్ మురాద్‌బేగ్, లింగం బాబూరావు, పిరాటి రాంబాబు పాల్గొన్నారు.



అవనిగడ్డ-నాగాయలంక ప్రధాన రహదారిపై గోతులు పూడ్చుతున్న టీడీపీ నేతలు

## పట్టాభి భవన నిర్మాణానికి ఎన్వోసీ ఇవ్వాలి

● మేయర్, కౌన్సిల్ సభ్యులు హైకోర్టు ఉత్తర్వులు పాటించరా: న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దివి పోతురాజు

మచిలీపట్నం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభిసీతారామయ్య స్మృత్యర్థం కన్వెన్షన్ హాల్, మ్యూజియం, లైబ్రరీల నిర్మాణానికి కార్పొరేషన్ కౌన్సిల్ ఎజెండాలో పెట్టి చర్చించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయినా మేయర్, కౌన్సిల్ సభ్యులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారు. మెజార్టీ ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి, వెంటనే భవన నిర్మాణానికి ఎన్వోసీ ఇవ్వాలి.' అని న్యాయవాదుల సంఘం మచిలీపట్నం అధ్యక్షుడు దివి పోతురాజు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘం హాలులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోవడమేంటని నిలదీశారు. న్యాయవాదులు పసుమర్తి సూర్యప్రకాష్, నరేంద్రనాథ్, జి.వంశీకృష్ణ, ప్రియాకత్, కె.రఘురామ్, వై.కిరణ్ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ సాగుపై శిక్షణ

మోపిదేవి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగులో కషాయాల తయారీపై బొబ్బర్లంకలో అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో శుక్రవారం కషాయాలు, బీజామృతం, ద్రవ, ఘన జీవామృతం, నీమస్త్రం, బ్రహ్మాస్త్రం, సప్తదన్యంకుర, కోడిగుడ్లు నిమ్మరసం ద్రావణం, పంచగవ్య తయారీ విధానాన్ని వివరించారు. ఏడీఏ జయప్రద పాల్గొన్నారు. అడిషనల్ డీపీఎం నాగమల్లేశ్వరి, హెచ్‌ఆర్ కృష్ణార్జున, మూడు మండలాల ఏవోలు, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలయాల్లో శ్రావణ పూజలు

మచిలీపట్నం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం తొలిరోజు మొదటి శుక్రవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈడేపల్లి శక్తిగుడి, కన్యకాపరమేశ్వరి ఆల యం, త్రిశక్తి పీఠం, కొజ్జిలిపేట నాగేశ్వరస్వామి దేవాలయం, బచ్చుపేట భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి దేవాలయం, రాబర్టుసన్‌పేట రామలింగేశ్వరస్వామి దేవాలయం, కేడీసీసీ బ్యాంకు సమీపంలోని మహాలక్ష్మి దేవాలయం, బందరుకోట కోదండ రామాలయం, గొడుగుపేట శాంతామల్లేశ్వరస్వామి దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. పోతేపల్లిలో విజయ కనకదుర్గ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈడేపల్లి సత్యసా యి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి శ్రావణ లక్ష్మీ వైభ వం కార్యక్రమం ప్రారంభించారు.

### అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు

నాగాయలంక: భావదేవరపల్లిలో గణపతి అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని పసుపుతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పూషడపు నిరంజనరావు పర్యవేక్షించారు.



ఈడేపల్లి శక్తిగుడి, పోతేపల్లి విజయకనకదుర్గ ఆలయం, భావదేవరపల్లి గణపతి అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులందరికీ సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో మల్లేశ్వరంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అమరావతి, పోలవరం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వస్తున్నారంటే కారణం కూటమి ప్రభుత్వమే అన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమికి పట్టం కట్టాలి

మోపిదేవి/చల్లపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమికి పట్టం కట్టాలని టీడీపీ సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్ అన్నారు. కోసూరువారిపాలెంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, రావి రత్నగిరి, రావి నాగేశ్వరరావు, యక్కటి హనుమాన్, సనకా నగేష్, శీలం అనిల్, సనకా గౌరీ శంకర్ పాల్గొన్నారు. చల్లపల్లిలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్‌లు 69వ బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు మోర్ల శివ, మల్లంపల్లి శివరామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు మాలెంపాటి శ్రీనివాసరావు, షేక్ నబీఘోరి తదితరులు పాల్గొన్నారు.



మల్లేశ్వరంలో సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



కోసూరువారిపాలెంలో పర్యటిస్తున్న టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్

### ఉల్లిపాలెంలో..

కోడూరు: ఉల్లిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ నేతలతో కలిసి టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని ఆయన బొలిశెట్టి విటల్ రావు పాల్గొన్నారు.

### మేడిలంకలో..

అవనిగడ్డ రూరల్: మేడిలంకలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కర్రా సుధాకర్, బండే రాఘవన పర్చూరి దుర్గా ప్రసాద్, మండలి రామ్మోహనరావు, మెగావత్తు గోపి, బట్టు నరసింహారావు, కమ్మిలి సుబ్రహ్మణ్యం, గరికిపాటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### బందరులో..

మచిలీపట్నం టౌన్: 34వ డివిజన్‌లో టీడీపీ నాయకుడు ఫిరోజ్ ఆధ్వర్యంలో, బందరు మండలం పెదపట్నంలో గడిదేశి రవి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎన్ గొల్లపాలెంలో టీడీపీ నాయకుడు కొనకళ్ల గోపీ, కొల్లూరి సురేష్, తాతా నాగమల్లేశ్వరరావు, బొర్రా రాజేష్, మురారి వీరకృష్ణ, ఈడేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో వేముల బుజ్జి, పోతేపల్లి పంచాయతీ ఉల్లిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో కమ్మిలి మధు, లింగం విజయ్ పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ముంతా రవీంద్రకుమార్, వార్డు ప్రెసిడెంట్ బొమ్మసాని వెంకటరమణ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బంటుమిల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మల్లేశ్వరం గ్రామంలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గానికి వో అండ్ ఎం గ్రాంట్ల కింద రూ.318.18 లక్షల నిధులతో 94 పనులు ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. అధిక ప్రాధాన్యమున్న 8 పనుల్లో అనుమతి పొందిన రూ.13.80 లక్షలతో 4 పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసీరావు, డీసీ చైర్మన్ బొర్రా కాశీ, సర్పంచ్ చెన్ను శ్రీని వాసరావు, గంధం సత్యనారాయణ, జొన్నలగడ్డ కొండ, నజీర్, కూనసాని చిన్నా, తహసీల్దార్ పూర్ణచంద్రరావు, ఆర్ఐ శంకర్, డీఈ శ్రీనివాస్, ఏఈ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## మండలంలో యూరియా కొరత లేదు

● ఏవో ఎ.సంజీవ్‌కుమార్

నాగాయలంక, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని వ్యవసాయ శాఖాధికారి ఎ.సంజీవ్ కుమార్ తెలిపారు. మండలంలో రిటైల్ ఎరువుల దుకాణాల్లో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 722 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. యూరియా 350 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్సు 229, ఎస్ఎస్పీ 64, డీఏపీ 48, ఎంవోపీ 29 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి వారం స్టాక్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రైతులు ఆందోళన చెంది అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేయొద్దని ఆయన సూచించారు.

## యూరియా అందుబాటులో ఉంచండి

● పీఏసీఎస్ సీఈవోలతో ఏవో జెన్ని

పెడనరూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉండేలా చూడాలని వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలకు ఏవో సజ్జా జెన్ని సూచించారు. మండల వ్యవసాయ కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్‌తో కలిసి వీఏఏలు, పీఏసీఎస్ కార్యదర్శులతో ఏవో సమావేశం నిర్వహించారు. ఈ క్రాప్, ఇన్సూరెన్స్, పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. శలపాటి వీర ప్రసాద్, శీరం ప్రసాద్ పాల్గొన్నారు.



కోటవానిపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం

## నందమూరులో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

పెడనరూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నందమూరులో స్వచ్ఛ సర్వేక్షణ్(2025) గ్రామీణ కేంద్ర కమిటీ బృందం శుక్రవారం పర్యటించింది. డిప్యూటీ ఎండీవో నాగిరెడ్డితో కలిసి టీమ్ లీడర్ పి.సందీప్ పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణను పరిశీలించారు. చిన్నారులకు, గర్భవతులకు, బాలింతలకు అందిస్తున్న ఆహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెట్లను నాటాలని వెలుగు సిబ్బందికి సూచించారు. మరుగుదొడ్లను ఉపయోగించాలని బహిరంగ మలవిసర్జన వలన అంటురోగాలు ప్రబలుతాయని ప్రజలకు సూచించారు. సంపద తయారీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి, వానపాముల ఎరువులను తయారుచేయాలని సూచించారు. ఎస్‌బీఎం పవన్, సర్పంచ్ పరసా నరసింహారావు, కార్యదర్శి డీవీఎన్ జానకీలక్ష్మి పాల్గొన్నారు.

## విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి

చల్లపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పీఎస్వీ సుబ్రహ్మణ్యం సూచించారు. జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం వారు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెడు స్నేహాలు, నిషేధిత ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, ఈవ్‌టీజింగ్ నేరమని వివరించారు. మహిళల భద్రతకు శక్తి టీమ్ చేస్తున్న కృషిని వివరించారు. సమస్యలు ఎదురైనపుడు డయల్ 112, 1930 టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పీఎస్ఐ కె.శ్రీలత, శక్తి టీమ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. రహదారి భద్రతా చర్యల్లో భాగంగా సీఐ ఈశ్వరరావు చల్లపల్లి ప్రధాన సెంటర్లో వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు.

## చల్లపల్లి పోస్టాఫీసులో రైల్వే సేవలు పునరుద్ధరించాలి

మచిలీపట్నం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి పోస్టాఫీసులో రైల్వే రిజర్వేషన్ కౌంటర్, తత్కాల్ సేవలను పునరుద్ధరించాలని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పోస్టల్ శాఖ సూపరిం టెండెంట్ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో నందమూరి హరికృష్ణ రాజ్యసభ సభ్యుడి గా ఉన్న సమయంలో చల్లపల్లి పోస్టా ఫీసులో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. చాలా కాలంగా ఆ సేవలు నిలిచిపోయాయని, తత్కాల్ రిజర్వేషన్ చేసుకోవాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.



పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ

## ఈద్గాను పునర్నిర్మించాలి

గూడూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిన ఈద్గాను పునర్నిర్మించాలని శుక్రవారం తహసీల్దార్ రాజ్యలక్ష్మికి ముస్లింలు వినతిపత్రం అందించారు. జామియా మసీదు కార్యదర్శి ఎంఏ సలీం, ట్రెజరర్ మొహ్మద్ బషీర్, సభ్యులు ఎండీ ఇస్మాయిల్, ఎండీ ఇలియాస్, ఇమామ్ ఎండీ జమాల్‌బేగ్ సాహెబ్, అబ్దుల్, జలీల్, షేక్ జన్ను పాల్గొన్నారు.

## దేవ బ్రాహ్మణ పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తారక బ్రహ్మం

చల్లపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దేవ బ్రాహ్మణ పండిత పరిషత్ రాష్ట్ర ఉపా ధ్యక్షుడిగా చల్లపల్లికి చెందిన సిద్ధాంతి జక్కుల తారక బ్రహ్మం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం చీరాల సాయిబాబా కల్యాణ మండపంలో నిర్వహిం చిన పరిషత్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. తారకబ్రహ్మానికి దేవాంగ సంఘీయులు అభినం దనలు తెలిపారు.



జక్కుల తారకబ్రహ్మాంను అభినందిస్తున్న పండిత పరిషత్ ప్రతినిధులు

## చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ

ఘంటసాల, జూలై 25(ఆంధ్రజ్యోతి): దాలిపర్రు గ్రామ మహిళలకు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. చిరుధాన్యాల ఉపయోగాలను కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి వివరించారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాలని ఆమె సూచించారు. రాగి లడ్డూ, రాగి చాక్లెట్ తయారీపై గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి శిక్షణ ఇచ్చారు. శాస్త్రవేత్తలు యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను పేరు మార్పునకు అవకాశం

మచిలీపట్నం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆస్తిపన్నులు కట్టేవారు రిజిస్టర్ పొందిన హక్కుదారుని పేరును మార్చుకునేందుకు ఆగస్టు 1 నుంచి అవకాశం కల్పిస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ బాపిరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మునిసిపల్ ఆస్తిపన్ను మ్యుటేషన్ కార్యక్రమంలో భాగంగా ఖాళీ స్థలం పన్నుల యాజమాన్యం హక్కును పొందేందుకు అవకాశం కల్పించామని ఆయన పేర్కొన్నారు.

## నగరంలో పారిశుధ్య చర్యలు

మచిలీపట్నం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని డ్రెయిన్లలో శుక్రవారం సిల్టు తీసే కార్యక్రమాన్ని చేపట్టారు. పెద్ద సంఖ్యలో పారిశుధ్య కార్మికులు సిల్టు తీసి ట్రాక్టర్లలో నింపుతున్నారు. ఆ బురదను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. మునిసిపల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. రోడ్లపై భారీగా మురుగు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

## బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సత్కారం

అవనిగడ్డ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ పంచాయతీలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్తున్న ఉద్యోగులను సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ శుక్రవారం సత్కరించారు. భార్గవ్, సౌమ్య, శైలజ, ప్రవీణ్, సుగుణకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

## ట్రైనీ ఎస్సైగా ఎం.నాగరాజు

పెడన, జూలై 25(ఆంధ్రజ్యోతి): ట్రైనీ ఎస్సైగా ఎం. నాగరాజు నియమితులయ్యారు. శుక్రవారం ఆయన పదవీ బాధ్య తలు స్వీకరించారు. అనంతరం ఎస్సై సత్యనారాయణతో కలిసి ఆయన విధుల్లో పాల్గొన్నారు.